# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206
web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకటరత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి
మిస్.పి. ఇందిరాదేవి
జి.ఎస్.ఆర్. మూర్తి
డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు
డా॥ యమ్.స్వర్ణముఖి

Volume 29 Issue 11
No.of Pages 44
JULY 2010

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:
మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,

## ఈ సంచికలో....

| | పేజీ |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీఅభిభాషణ | 8 |
| సన్నిధిలోసంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 13 |
| సత్సంగసౌరభం | 14 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 16 |
| శ్రీకృష్ణతత్త్వము ప్రేమయోగము | 19 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 21 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 23 |
| మాతాజీ బోధామృతం | 25 |
| మాతాజీ సత్సంగ్ డైరీ | 27 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 29 |
| సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర | 31 |
| నీవు వినలేని పిలుపే లేదు | 34 |
| ప్రయాణకాలే z పిచ మాం | 36 |
| అమెరికాలో శ్రీ మాతాజీ | 38 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 42 |

# భద్రవాక్యం

**శ్లో ॥ అజ్ఞాన కలుషం జీవం జ్ఞానాభ్యాసాద్వినిర్మలమ్ ।**
**కృత్వా జ్ఞానం స్వయం నశ్యే జ్జలమ్ కతకరేణువత్ ॥**

-ఆత్మబోధ

ఇది శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్య కృత ఆత్మబోధ అను ప్రకరణ గ్రంథంలో మూడవ శ్లోకము.

అవిద్య, అజ్ఞానం, సంసారం, జగత్తు, జీవత్వం మొదలైనవన్నీ సజాతీయము కనుక సహజంగానే జీవత్వం అజ్ఞానంతో కలుషితం అయి ఉంటుంది. స్వచ్ఛమైన, నిర్మలమైన తేట నీటిలాగా ఉండవలసిన జీవనం ఈ అజ్ఞానం అనే కలుషం వల్ల బురద నీరులాగా అవుతుంది. ఆ బురదనీరు త్రాగటానికి పనికిరాదు. అది అనుభవయోగ్యం కావాలంటే అందులో కాస్త చిల్లగింజ గంధం కలిపితే చాలు. అప్పుడది బురదను విరుస్తుంది. స్వచ్ఛమైన నీరు పైకి తేరుకుంటుంది. బురద అడుగుకు పోతుంది. చిల్లగింజ గంధంకూడా బురదతోపాటు అడుగుకుపోయి అందులో కరిగి తానూ కూడా లేకుండా అయిపోతుంది.

అలాగే ఈ అజ్ఞానం పోవాలి అంటే జ్ఞానాభ్యాసం కాలాలి. ఈ జ్ఞానం పై ఉదాహరణలోని చిల్లగింజ గంధంలాగా పనిచేసి, అజ్ఞానాన్ని తొలగించి, తానుకూడా తనంత తానుగా తొలగిపోతుంది.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. ఆత్మకంటే భిన్నమైన జ్ఞానం మఱొకటి ఉంటే, ద్వైతం ఉన్నట్లే కదా! ద్వైతం ఉన్నంత కాలం ముక్తి ఎలా సాధ్యం? అని.

అందువలననే ఇక్కడ జ్ఞానం అనే పదానికి అర్థం ఆత్మయే తాను అయిన జ్ఞానం కాదని, అది బుద్ధికి సంబంధించిన వృత్తి జ్ఞానము అని అర్థం చేసికోవాలి. ఈ బుద్ధివృత్తి ఆత్మయొక్క అఖండాకార వృత్తిని గ్రహించి మిగిలిన అన్ని బుద్ధివృత్తులతోపాటు అజ్ఞానాన్నికూడా తొలగిస్తుంది. చివరకు అద్వైతవృత్తి అద్వైత దీప్తిగా మారగానే, ఆ బుద్ధి సంబంధమైన అఖండాకారవృత్తికూడా తొలగి, చిల్లగింజ గంధం కలిపిన బురదనీటిలో స్వచ్ఛమైన నీరు ఎలా తేరుకుంటుందో, అలా అద్వయమైన ఆత్మ ఒక్కటే ఉంటుంది. *

# అమ్మ ఆశీస్సులు

నగురోరధికం,నగురోరధికం,నగురోరధికం,నగురోరధికం
శివశాసనతః,శివశాసనతః,శివశాసనతః,శివశాసనతః

శ్రీసదాశివుని ఆజ్ఞ వలన గురువరునికంటె ఉత్కృష్టమైనది మరియొక్కటి లేదు. ఈశ్వరుని ఆజ్ఞ వలన పరబ్రహ్మము కంటె అధికమైనది మరేదియు లేదు. మహేశ్వరుని ఆజ్ఞ వలన గురుదేవునికంటె మహత్తరమైనది లేదు. శ్రీ హరుని శాసనము వలన గురుదేవుని కంటె అధికమైనది లేదు. ఇట్లు నాలుగు సార్లు చెప్పుట చేత శ్రీ గురుదేవునికంటె మహోత్కృష్టమైనది లేదు - ఇది శివ శాసనము.

గురుతత్త్వం అనంతం, అఖండం,అద్వితీయం. సర్వే సర్వత్ర నిండి ఉన్న గురుదేవులకు మనస్ఫూర్తిగా భక్త హృదయాలు నమస్కరిస్తే అది ఆయనకు అందదా? తప్పక అందుతుంది. దేహభ్రాంతిలో కొట్టుమిట్టాడే మానవాళిని ఉద్ధరించటానికై ఆ అనంతశక్తి సద్గురురూపం ధరించి వచ్చింది. ఒక్కసారి కనులు మూసికొని, మనస్సును అంతర్ముఖం చేసికొని వారిని దర్శించండి. ఒక అలౌకికానందం లభిస్తుంది.

మన జీవితాలు గడిచి పోతున్నాయి. ఇన్నేళ్లుగా మనం సాధించినది ఏమిటి? అని ఎవరికి వారు ప్రశ్నించుకోండి. మనం సమయం ఎందుకు సద్వినియోగం చేసికోలేకపోతున్నాం? సాధనచేసికోవటానికి ఒక స్థానాన్ని కల్పించారు. వారి పాదాలను ఇచ్చారు. వారి పదములను(బోధ) ఇచ్చారు. వారి బోధను అర్థం చేసికొని ఆచరించగలిగితే పరమానందస్థితిని పొందుతావు.

మనస్సును పవిత్రభావాలతో నింపుకోండి. విషయాదులకు తావివ్వకండి. మనస్సును అంతర్లీనం చేసికొని ధ్యానం చేయండి. అప్పుడు ఆనందానుభూతి లభిస్తుంది. అన్నిటిని త్యజిస్తే వినబడేది ప్రణవనాదమే. 'మనోలయం, ముక్తిలయం యథార్థః' అని శాస్త్రాలు చెబుతున్నాయి.మీమనస్సు సమస్యలనుండి విడివడితే మనోలయం సిద్ధిస్తుంది. అందుకు గురుబోధా మృతాన్ని మించింది లేదు. ఒక గిన్నెలో బోధామృతాన్ని మీకు ఇస్తే ఎక్కడనుండి త్రాగుతారు? అంచునుండి త్రాగుతారా? అందులో పూర్తిగా మునిగిపోవాలి. ఎందుకంటే అది అమృతం కదా! సాధనను నిరంతరంగా చేయండి. మనకు ఈ నెల 27న ఆషాఢ పూర్ణిమ వస్తోంది. ఏ విధంగా పూర్ణిమ చంద్రుడు పూర్ణత్వాన్ని పొందుతాడో అదే విధంగా మీ పవిత్ర హృదయాలలలో శ్రీ సద్గురుదేవులు పూర్ణంగా ప్రకాశించాలని, అట్టి సాధనా సంపత్తిని, ఆత్మజ్ఞానాన్ని శ్రీ గురుదేవులు మీకు ప్రసాదించాలని శ్రీగురుదేవులను ప్రార్థిస్తున్నాను.

- మీ అమ్మ

# సంపాదకీయం

శ్రీ సద్గురుదేవుల అత్యంత ప్రియభక్తురాలు, పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీవారిని కంటికి రెప్పలా అంటిపెట్టుకుని ఉండి వారిని నిరంతరం సేవించుకున్న శ్రీ సుగుణ ప్రసాద మాతాజీ తృతీయ వార్షిక పుణ్య ఆరాధన జూన్ 20వ తేదీన అత్యంత భక్తి భరితంగా జరిగింది. ఆనాటి సత్సంగ సమావేశ కార్యక్రమంలో పరమహంస పరివ్రాజక శ్రీశ్రీశ్రీ 108 దండి నిర్మలానంద గిరిస్వామివారి అనుగ్రహభాషణం ప్రత్యేక ఆకర్షణ.

శ్రీ సద్గురుదేవుల అంతరంగ భక్తులు, గురుదేవులు పెదవి విప్పేలోగానే వారి ఇంగితాన్ని గ్రహించి, గురుదేవుల ఆజ్ఞను తు.చ. తప్పక పాలించిన కర్మయోగి, పరమ భక్తుడు పాండురంగ ప్రసాద్ ప్రథమ వార్షిక ఆరాధన ఈ నెల 21, 22, 23 తేదీలలో జరుగుతుంది. ఈ సందర్భంగా వారి పుత్రులు పాండురంగడి పరమ భక్తాగ్రేసరుడైన సంత్ నామదేవ్ చరిత్రను ముద్రించి భక్తులకు అందించాలని తీసుకున్న నిర్ణయం ఎంతో సముచితంగా ఉన్నది. భక్తి ప్రబోధకంగా, ఎంతో రసవత్తరంగా రచించబడిన ఈ గ్రంథం పాఠకులకు తప్పక అత్యంత ప్రీతిపాత్రం కాగలదని విశ్వసిస్తున్నాము.

శ్రీ మాతాజీ అమెరికాలో తమ కార్యక్రమాలను ముగించుకొని ఈ నెల 20వ తేదీన స్వదేశానికి తిరిగి వస్తున్నారు.

శ్రీ కాళీవనాశ్రమ భాగ్యనగర శాఖవారి సత్సంగ కార్యక్రమాలు ఈ నెల ది. 28నుండి ఆగష్టు 1 వరకు తిరుమల తిరుపతి దేవస్థానం వారి కళ్యాణ మండపం(హిమాయత్ నగర్) లో జరుగుతాయి. వివరాలు ఈ సంచికలో 14 వ పేజీలో చూడవచ్చు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే.

ఈ నెలలో వచ్చే ఆషాఢ పూర్ణిమ వ్యాస పూర్ణిమ. గురుభక్తులందరూ, విశేషించి గురులక్ష్యార్థం తీసుకున్న భక్తులు, గురు సంప్రదాయంలోనివారు శ్రీ సద్గురు దేవుల సన్నిధానంలో ఉండాలని కోరుకునే రోజు. ఎక్కడ ఉన్నా గురుపూర్ణిమ పేరు వినగానే ఏ భక్తుడి శరీరం రోమాంచితమౌతుందో, హృదయం పులకరిస్తుందో వారే నిజమైన భక్తులని, గురు సాన్నిధ్యంలో గడిపిన కాలము వారి నిత్య కాలములో జమ అవుతుందని శ్రీ గురుదేవులు ఉవాచ. అందరిని గురుపూర్ణిమకు సాదరంగా ఆహ్వానిస్తున్నాము.

- గౌరవ సంపాదకుడు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్
9-10-1978 సోమవారం



కళ్ళకు కనిపిస్తూ, చెవులకు వినిపిస్తూ, మన జ్ఞానేంద్రియాలకు, కర్మేంద్రియాలకు అందుతూ, కనిపించే ఈ సమస్త సృష్టిలోని ప్రతి వస్తువు అనిత్యమైనదని, మనందరికి అనుభవ పూర్వకంగా తెలుసు. అంతేకాదు, ఈ సృష్టినంతటిని ప్రకాశింపజేస్తూ, దాని పరిణామాలు వేటినీ తాను పొందక, పరిణామ రహితమై నిత్యమై తనకు తాను ప్రకాశించే ఒక నిత్య వస్తువు ఈ సృష్టి అంతటా అణువణువునా నిండి ఉందని కూడా మనకు తెలుసు. ఇంకా మనకు తెలిసిందేమిటంటే, సుఖ, శాంతుల కోసం జగత్తులోని అనిత్య వస్తువులను నమ్ముకున్నంత వరకు, మనకు లభించేది దుఃఖమేనని, వాటిలోనే వ్యాపించి ఉండి, వాటిని ప్రకాశింపచేసే నిత్య వస్తువును, అంటే పరమాత్మ వస్తువును నమ్ముకుని, దానిని సాధించిన నాడే మానవునికి శాశ్వత సుఖశాంతులు లభిస్తాయని. మీరందరు ఈ అనిత్య వస్తువులపై దృష్టిని దాటి, ఆ నిత్య వస్తువును చూసేది ఎప్పుడా అని నా(మీ హృదయబాబు) ఆవేదన. కాని ఆ దృష్టి మీకు లేదు.

దుష్ట చతుష్టయం వల్ల లోకానికి అరిష్టం రాకుండా కాపాడాలని శ్రీకృష్ణ భగవానుడు ఎంతో ప్రయత్నించాడు. వింటారా? వినరు. ఎవళ్ళ మాటో ఎందుకు? మనం వింటున్నామా? "భగవంతుణ్ణి నమ్ముకో; నీ సర్వ కష్టములూ తొలగుతవి" అని, "అది ఖర్చులేని పని" అని, "భగవంతుణ్ణి నిరంతరము ప్రార్థించు, పూజించు, వేడుకో" అని, మహాత్ములు, జ్ఞానులు, అనుభవం పొందినవారూ చెప్పితే వింటారా ఈ మానవులు? వినరు. ప్రక్క వాళ్ళు విననివ్వరు. బీరకాయ(Beer Bottle), చతుర్ముఖ పురాణం, హోటలు ఇవి కావాలి గాని భగవంతుడు, కంటికి కనపడనివాడు, మనకెందుకు?

మానవునికి పట్టిన అరిష్టాలను తొలగించుకోటానికి నవగ్రహ పూజలు, దానాలు చెయ్యమంటారు. ఆ పూజలతో, దానాలతో నవగ్రహాలైనా శాంతించవచ్చునేమోగాని, మానవుణ్ణి నరగ్రహం (దుష్ట స్నేహితుడు) పడితే

మాత్రం, వాణ్ణి సర్వనాశనం చేసిందాకా శాంతించదు; చచ్చేదాకా వదలదు. సత్యాన్ని తెలియజేసి కనువిప్పు కలిగించే మహాత్ముడెవరైనా కనిపించినా, విమర్శిస్తారు. మనకు మల్లేనే భోంచేస్తూ, పడుకుంటూ, నిత్యకృత్యాలు చేస్తూ ఉండే ఈ మానవుడు మహాత్ముడేమిటని? అని ప్రశ్న వాళ్ళకి, "నీ కష్టముల నుండి విముక్తి పొందాలంటే, సుఖ శాంతులు పొందాలంటే, లక్ష్మీమనోహరుణ్ణి నీ హృదయంలో నిలుపుకో; సత్యమార్గమునే అనుసరించు" అని ఆ మహాత్ములు చెప్పే మాటలు కర్ణకఠోరంగా ఉంటాయి వీళ్ళకు. ఒక పిచ్చివాడు తన ఎదుట కనిపించిన ప్రతివాణ్ణీ "పిచ్చివెధవా" అన్నట్లు, వాళ్ళ కళ్ళకి మహాత్ములంతా వెట్టి వాళ్ళకి మల్లేనో మోసగాళ్ళకి మల్లేనో కనిపిస్తారు. శ్రీకృష్ణ పరమాత్మను మోసగాడని, మాయావి, జూదరి, జారుడు, చోరుడు అని, తమకున్న లక్షణాలన్నీ ఆ మహాత్మునికి అంటగట్టే దుర్యోధనాది వర్గానికి చెందిన వారు వీళ్ళు. అటువంటి మూర్ఖులను, మొండి వాళ్ళను కూడా మార్చాలని, సంధి కుదిర్చి లక్షలాది అమాయక ప్రజల ప్రాణాలను కాపాడాలని, దయామయుడైన ఆ పరమాత్మ ప్రయత్నించాడు. వాళ్ళు ఆయనను బంధించాలని కుట్రపన్నారు. అది ఆయన లక్షణం. ఇది వీళ్ళ లక్షణం. వీళ్ళ కుట్రలకు, కుతంత్రాలకు ఆయన అందేవాడా? ఆ ప్రభువు జగదేకవీరుడు. ఆయన పరాక్రమం వెన్ను చూపని సత్య పరాక్రమం.

మానవుని బంధించే మాయా శక్తిని జయించగల శక్తి ప్రపంచంలో ఎవరికీ లేదు. ఆ మాయాశక్తికి అధిష్ఠాన స్వరూపుడు, ఏకైక వీరుడు అయిన ఆ పరమాత్మ ఒక్కడే అందుకు సమర్థుడు. నిజమైన రారాజు ఆయనొక్కడే. మోహంలో ముంచి వేసే క్షణిక సౌందర్యాల నుంచి మనలను కాపాడే సత్య సౌందర్యరాశి ఆయనొక్కడే. మాయ నుండి రక్షించి మానవునికి ఆనందాన్ని శాంతిని ఇవ్వగలగటమే సత్య పరాక్రమము. అట్టి పరాక్రమశాలి ఆయనొక్కడే. ఆయనను వేడుకుంటే, ఆశ్రయిస్తే, అజ్ఞాన తిమిరాన్ని హరించి, హృదయ మందిరంలో అంతటా సత్య లోకంగా మార్చి జ్ఞానజ్యోతి వెలుగులతో నింపగలడు. అక్కడ పరమశాంతి రాజ్యమేలుతుంది. అసత్యమైన మాయాశక్తిని, దాన్ని ఆశ్రయించి ఉన్న కామ క్రోధాది గుణములు, ఈషణత్రయములు మొదలైన పరివారంతో సహా సంహరించి మనలను రక్షించగల రక్షకుడు ఆయనొక్కడే. సంసార సాగరంలో పడి కొట్టుకుపోయే మానవుని చెక్కిలిపై కన్నీరు తుడిచి, అభయమిచ్చి ఆదుకునే ఆపద్బాంధవుడు ఆయనొక్కడే.

ఆయన అభయహస్తం ఎప్పుడూ అలాఎత్తిన చెయ్యి ఎత్తినట్లుగానే సిద్ధంగా ఉంటుంది. శరణు అంటే చాలు, ఆ అభయహస్తం రక్షిస్తుంది. ఆ అభయహస్త కిరణాలకు, శత్రువు, మిత్రుడు, ధనికుడు, బీద అనే తేడాలు లేవు. ఆ దివ్య కిరణాలు సకల జీవకోటిపైనా సమానంగా ఎప్పుడూ ప్రసరిస్తూనే ఉంటాయి. అందరు ఆయన బిడ్డలే.

భగవంతుని ప్రేమను మించిన ప్రేమ లేదు. అది నిత్యము, సత్యము, అపారము, అవ్యాజము, ప్రతిఫలాపేక్ష రహితము అయిన ప్రేమ. దారాపుత్రాదుల ప్రేమలు సత్యమూ కాదు; నిత్యమూ కాదు. అవి కళంక సహితమైన ప్రేమలు. అపుత్రస్య గతిర్నాస్తి. బిడ్డలు లేనివారికి గతులు లేవు అంటారు. ఈ కర్మ పుత్రులు కాదు తరింపచేసేది. మానవుడు భక్తి అనే గర్భాన్ని ధరించి, జ్ఞానమనే పుత్రుణ్ణి పొందాలి. అలా ఏ జన్మలో పొందగలిగితే, ఆ జన్మలోనే మానవుడు తరిస్తాడు. అమ్మన్నకు పూలంటే ఇష్టం. అమె కొప్పులో పూలు పెట్టుకుంటే నాన్నగారు "క్షణంలో వాడి రాలిపోయే ఈ అలంకారం ఎందుకు? జడమైన ఈ శరీరానికి వాడిపోయే పూలతో చేసే ఈ అలంకారము శవాలంకారమే. జ్ఞానమనే పుష్పం, ఎప్పుడూ వాడనిది; సత్య పరిమళంతో ప్రకాశించేది. అటువంటి జ్ఞానమే నిజమైన అలంకారం మానవుడికి" అనేవారు. దీపం లేని గదికి, దీపం ఉన్న గదికి ఎంత తేడా ఉంటుందో, అజ్ఞానికి, జ్ఞానికి అంత తేడా ఉంటుంది. జ్ఞాన దీపము ఆరేది కాదు. అది ఉన్న చోట అజ్ఞానమనే చీకటి దరిదాపులకు కూడా రాలేదు. అందుకే జ్ఞాని సదా మందహాసంతో ఆనందంగా ఉంటాడు. జ్ఞాన జ్యోతి వెలగని వాడు పాడుపడిన కొంపవలె ఉంటాడు. జ్ఞానికి నిత్యము శాంతి. వారి ఇంట్లో శాంతి. దారాపుత్రాదులకు శాంతి. అజ్ఞాని ఇంట్లో అంతా చీకటే; అశాంతే, దుఃఖమే. "అట్టి అశాంతిలో కూడా, నన్ను ధ్యానిస్తే, నీ అశాంతిని దుఃఖాన్ని తొలగిస్తాను" అంటాడు భగవానుడు. భగవంతుని ప్రేమ సత్యప్రేమ. చెరువులో నీళ్ళు ఉన్నప్పుడు, మనుష్యులే కాక, చేపలు, కప్పలు ఇతర జీవరాసులు అన్నీ చేరతాయి. కాని చెరువు ఎండిపోతే ఎవ్వరూ దాని వంకనైనా చూడరు. కాని, చెరువులో నీరున్నప్పుడు, ఎండిపోయినపుడు కూడా, దానిపైన తన కాంతిని సమానంగానే ప్రసరింపజేస్తాడు సూర్యభగవానుడు. మరి ఆ సూర్యునికే ఆ కాంతిని ప్రసాదించిన పరమాత్ముని ప్రేమను దయను వర్ణించగలమా? ఆయన ప్రేమ, జాతి, నీతి, కుల, గోత్ర, ఉచ్ఛ, నీచ, తరతమ భేదాలు లేకుండా సర్వ జీవకోటిపైన సదా వర్షిస్తూనే ఉంటుంది.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద

ఒకవేళ జన్మాంతర వాసనలు వున్నా కూడా, గురుపాదము నాశ్రయించి శరణాగతిని పొందినాక, వాటినన్నింటినీ క్షాళన చేసుకోవడానికి మహాత్ములు నిర్దేశించినట్లుగా సాధన చేయాలి. అప్పుడే ఆ మహాత్ములు అందించే విషయాన్ని అందుకో గలుగుతాము. సాధుమహాత్ముల సన్నిధికి వచ్చికూడా, మనసులో అనేక విషయాలు పరుగులు పెడుతూ వుంటే అది మనలని ఇక్కడ కూర్చోనీయదు. ఎప్పుడు టైమవుతుందా, ఎప్పుడెప్పుడు వెళ్ళిపోదామా అనే చూస్తే, యిక్కడకు రావడం అనవసరం.



అందుకని, మహాత్ముల సన్నిధికి వచ్చేటప్పుడు, మన మనసుని ఖాళీ చేసి, ఈ వాసనలన్నింటినీ గేటు బయటే పెట్టి, "నేను మహాత్ముల వాక్కులు వినడానికి వెళ్తున్నాను కనుక, ఓతల్లీ! నువ్వు నా వెంట రాకు. నేను తిరిగి వెళ్ళేటప్పుడు నిన్ను మళ్ళీ తీసుకొని వెళ్తాను. నీవు నాకిచ్చేదాని కంటే యింకా గొప్పదైన ఆనందాన్ని పొందడానికి వెళ్తున్నాను" అని మనసుకి నచ్చచెప్పి, వాసనలతోకూడిన మనసుని బయటపెట్టి వస్తేగాని, ఇటువంటి సత్సంగ సమావేశాలలో మహాత్ములు అందించే దివ్యబోధ, సద్విషయాలు, మన మనుస్సుకి అందవు. ఇవి మామూలు విషయాలు కావు. ఇవి సద్విషయాలు. మహాత్ములు అనేకమైన దివ్య విషయాలు ఒలకబోసేస్తున్నారిక్కడ. మన మనస్సులని వాటిలోనే ఊరవేయగా, వేయగా, వాటిలోని కొన్నైనా మనం చేయగలగాలి అనే సద్భావన మనలో పెంపొందుతుంది. అప్పుడు వాటిని ఆచరించడానికి ప్రయత్నం చేయాలి.

ప్రపంచంలో ఏపని చేయాలన్నా ప్రయత్నం చేసి తీరాల్సిందే! ఒక వ్యాపారం చేయాలన్నా, ఒక ట్రైనుకి వెళ్ళాలన్నా, కడకి ఇడ్లీ చేయాలన్నా, అన్నిటికీ ప్రయత్నం చేసి తీరాల్సిందే. అంతేకాక, అన్నిటికీ మనం టైము పాటిస్తున్నాం.

మరి సజ్జన సాంగత్యానికి వచ్చేటప్పుడు టైము పాటించవద్దా? పాటించితీరాలి. అదేవిధంగా, మన అనుష్ఠానానికి కూడా ఒక టైము పెట్టుకోమని మహాత్ములు చెప్పారు. 'ఈ టైములో ఇది చేసుకుంటే నీకు బాగుంటుంది. నువ్వు సంసారంలో ఉన్నా కూడా ఫరవాలేదు. తెల్లవారురఝామున నీకు సంసారం బెడదా, పిల్లల గొడవా వుండదు కాబట్టి, తెల్లవారురఝామునే లేచి అనుష్ఠానం చేసుకో' అని మహాత్ములంటే, 'అమ్మో! తెల్లవారురఝామునే?' అంటావ్! మరెప్పుడు చేస్తావు సాధన? తెల్లవారితే నీకు సందడి ఎక్కువైపోతుంది! వెలుగొచ్చిన కొద్దీ శబ్ద తరంగాలు ఎక్కువైపోతాయి! నీ మనసు శబ్దరహితం అవ్వాలంటే, తెల్లవారురఝామునే, బ్రాహ్మీముహుర్తంలో అనుష్ఠానం చేసుకోవాలి. కనుకనే, మనం సరైన సమయంలో త్వరపడాలి.

వివేకానందమహరాజ్ వారు చెప్పిన కఠోపనిషద్వాక్యం "ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ని బోధత'' అన్నది అక్షరసత్యం. దాని అర్థం చెప్పుకోవాలంటే, 'లే! జాగ్రత్తపడు! మహాత్ములనాశ్రయించి సత్యాన్ని తెలుసుకో! - నీ గమ్యం చేరేంత వరకూ విశ్రమించకు!'

ఇలా అంటే కొంతమంది "అదేమిటండీ! మేము మెలకువగానే ఉన్నాం కదండీ!'' అంటారు! ఇది నిజమైన మెలకువ కానేకాదు. 'ఈ తనువే నేను' అని అనుకున్నంతసేపూ అది నిద్రే. అదే అజ్ఞానమనే నిద్ర. ఏం చేస్తున్నా ఈ తనువుని మాత్రం మనం మరచిపోటంలేదు. ఆ భావనని యింకా యింకా దృఢం చేసుకుంటున్నాము. అందుకే, 'సకల వాగగోచరమైన బ్రహ్మవస్తువు నేను' అనే సత్యాన్ని గుర్తించలేక పోతున్నాం. అటువంటి బ్రహ్మవస్తువుని విషయాలలో వుండి పొందలేము. ఈ చర్మచక్షువులకది గోచరం కాదు. అది కేవలం నిర్మలమైన జ్ఞానచక్షువులకి మాత్రమే గోచరమవుతుంది. అది అనుభవైకవేద్యం. కానీ ఈ చర్మచక్షువులనే గోళకాలకి అవతల వుండి, వాటికి చూచే శక్తినిచ్చేది ఆ ఆత్మవస్తువే! మనసుకున్న మలినమంతా రహితం చేసుకుని, మలత్రయ రహితమైన ఆ విమల బోధచక్షువు చేత శుద్ధ చిద్ఘనమైన అనాది వస్తువు చూడబడుతుంది. ఏదయితే 'చిత్' స్వరూపమై యీ జగత్తంతటికీ శక్తి నిస్తోందో, అదే బ్రహ్మవస్తువు అనే అనుభవం వస్తోంది. 'అట్టి బ్రహ్మవస్తువే నువ్వు' అని భావన చేయి అన్నారు శ్రీశంకరులు.

అంతేగాని, 'నేను బ్రహ్మని, నేను బ్రహ్మని' అని జపం చేసినంత మాత్రాన నువ్వు బ్రహ్మవు అయిపోవు. బ్రహ్మ లక్షణాలు ఏవై వున్నాయి? అని నిరంతరం విచారణ చేయాలి.

మీకొక ఉపమానం చెబుతాను. జాగ్రత్తగా వినండి. ఇక్కడున్న బల్బులకీ, ఫ్యానులకీ మైకులకీ అన్నిటికీ కరెంటే శక్తినిచ్చి పని చేయిస్తోంది. కరెంటు వుంటే ఇవన్నీ పనిచేస్తాయి. కానీ కరెంటుకి ఇవేవీ ఆధారంకాదు. ఆ కరెంటు పోతే, ఇవన్నీ ఆరిపోతున్నాయి. కరెంటు పోతే మళ్ళా వస్తుంది. కానీ, బల్బు మాడిపోతే దానిని తీసి పారవేస్తాం. అది తిరిగిరాదు. ఇది కేవలం ఉపమానం మాత్రమే. కరెంటు పోవడం, రావడం అనేది కూడా ఉపాధులలో, అంటే కరెంటు స్తంభాలలోనో, గ్రిడ్డులలోనో లోపంవల్లనే కాని, వాస్తవానికి కరెంటుకి రాకడా, పోకడా లేదు. అది ఎప్పుడూ, వున్నచోటునే వుంది. దానికి కూడా శక్తినిచ్చేవాడు వేరేవున్నాడు. లోతుకి వెళ్ళి, మహాత్ములందించే బోధని అందుకుంటూ వెళ్ళాలి - అప్పుడు మనకి అసలు తత్త్వం బోధపడుతుంది.

ఈ ఉపాధి పనికిరాకపోతే, దీన్ని తీసేస్తున్నారు తప్ప, మనలో వున్న చైతన్యం సర్వవ్యాపకమైనది. దానిని గుర్తించడం మహాత్ములు మనకి నేర్పిస్తున్నారు. అది గుర్తించకుండా, 'మాయ! మాయ!' అని మనకి మనమే అడ్డు పెట్టుకుంటున్నాము.

దానికే, భగవద్గీతలో పరమాత్ముడు ఏం చెప్పాడంటే-

'దైవీహ్యేషాగుణమయీ - మమ మాయా దురత్యయా

మామేవ యే ప్రపద్యంతే - మాయామేతాం తరంతితే' అని...

అంటే, 'ఈ మాయ నానుంచే వచ్చింది. దానిని దాటడం చాలా కష్టమే. కానీ, ఎవరయితే నన్నే శరణుపొందుతారో, వారిని నేనే ఆ మాయ నుండి దాటిస్తాను' అని. మనం భగవంతుడినే ఆశ్రయించాం అంటున్నాం గానీ, 100% ఆశ్రయించడంలేదు. ఏ క్షణాన్నయితే తన తప్పుని తాను గ్రహించి 'కార్పణ్యదోషోపహత స్వభావః పృచ్ఛామి త్వామ్ ధర్మసమ్మూఢ చేతాః। యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే। శిష్యస్తే zహం శాధి మాం త్వామ్ ప్రపన్నమ్' అని ఆశ్రయించాడో, అర్జునుడిక వెనుదిరిగి చూడలేదు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

ఇక్కడ మన మధ్యలో కూర్చున్న రావుగారు మహాపండితులు. అన్ని శాస్త్రాలు తెలిసినవారు. కాని గురుసాన్నిధ్యంలో ముక్కుపొడుం పీల్చకూడదని తెలియదా? ఆయన అంతరాత్మ ఆయన చేసేది తప్పు అని ప్రబోధం చేస్తూనే ఉంటుంది. కాని ఆయనలోని దుష్టశక్తి ఆ విషయాన్ని అనుభవించమంటుంది. స్వామి మనని చూడటం లేదులే ఒక్కసారి పీలిస్తే ఏమౌతుంది? ఆయన చూడడు కదా! ఒకవేళ చూసినా నన్ను ఏమీ అనరు. అపార్థం చేసికోరు. ఆయనకి లోపల దురభిప్రాయం కలిగినా పైకి మాత్రం ఏమీ అనరు. కాబట్టి పీల్చు పీల్చు అని ప్రబోధిస్తుంది ఆ దుష్టశక్తి అన్నారు శ్రీబాబు.

ఇంకా మాట్లాడుతూ సాత్త్విక స్వభావం కలిగిన సత్త్వగుణం మాత్రం గురుసాన్నిధ్యంలో ఇటువంటి పనులు చేయటం తప్పు అని హెచ్చరిక చేస్తూనే ఉంటుంది. మరి ఇక్కడ తప్పు ఎవరిది? భగవంతుడిదా?

సాధారణంగా మానవులు చెడిపోవటానికి కారణం సాంగత్యదోషం. కొంతమంది స్నేహితులు తమ మిత్రులకి ప్రబోధం చేస్తారు. ఈ శరీరం ఎందుకు? సృష్టిలో ఉన్నవన్నీ అనుభవించటానికి, ఆనందించటానికి కాబట్టి అనుభవించు అంటారు. మరి అటువంటి సాంగత్య దోషం వలన దుర్వ్యసనాలకు లోనై దుస్థితి కలిగితే ఆ తప్పు ఎవరిది? దానికి కారకులు ఎవరు? అన్నారు.

ఈయన చూడండి! అంటూ ఇంకో భక్తుణ్ణి చూపించి తన పిల్లల చదువులు, కుటుంబ సమస్యల గురించి మాట్లాడదామని వచ్చాడు. ఆస్తిపరుడైన అల్లుడిని తెచ్చుకుందామని ఆయన యత్నం. కాని వాళ్ళ అమ్మాయి మనస్సు ఆయనకేం తెలుసు? నాకు తెలుసుగాని. ఆ అమ్మాయి పాపం బాగా చదువుకున్నవాడిని తన భర్తగా చేసుకుంటే బాగుంటుంది అనుకుంటోంది. ఇలా ఉంటాయి వీళ్ళ మనోభావాలు.

నా దగ్గరకు వచ్చే వాళ్ళందరినీ చూసి మహాభక్తులనుకుంటారు మీరు. ఏమిటి బాబుగారు వీళ్ళను చూసి అలా కోపగించుకుంటున్నారు? ఆయన దర్శనార్థం వచ్చారు కదా! అని మీరు భావిస్తారు. వాళ్ళ మనోభావాలు మీకు ఏం తెలుస్తాయి? కాబట్టి మీరు గ్రహించవలసినదేమిటంటే ఇంతవరకు ఎటువంటి జీవితం గడిపినా ఈ క్షణం నుంచి అయినా నిన్ను నువ్వు

సంస్కరించుకొని నీ జీవితాన్ని సరిదిద్దుకొనే అవకాశం భగవంతుడు కలుగజేస్తానంటున్నాడు అన్నారు శ్రీబాబు.

**26-3-1985**

ఈ రోజు రాత్రి ప్రార్థన అయిన వెంటనే భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీబాబు బయటకు వస్తూనే ఎదురుగా ఉన్న వ్యక్తిని చూసి ఎవరు అని ప్రశ్నించారు. ఆ వ్యక్తి సమాధానంగా నేనే అని చెప్పారు. శ్రీబాబు మళ్ళీ ప్రశ్నిస్తూ 'నేనేనంటే?' అన్నారు. నేను రాజ్యాన్ని అన్నారు. శ్రీబాబు ప్రశ్నిస్తూ రాజ్యమంటే రామ రాజ్యమా? సామ్రాజ్యమా? ఏ రాజ్యము? అన్నారు. ఇంకా మాట్లాడుతూ ఏమిటండీ గురువుగారూ! ఎవరూ అంటే నేను అంటుంది. సామ్రాజ్యాన్ని అంటుంది. ఫలానా వారి అమ్మాయిని అంటుంది. లేకపోతే మా ఆయన భార్యని అంటుంది. అంతా కన్‌ఫ్యూజ్‌గా ఉంది. అసలు ఎవరో తెలియటం లేదు అన్నారు. పోనీ నువ్వు అయినా చెప్పమ్మా! అక్కడ ఉన్న వ్యక్తి ఒకటే కదా! అన్నారు శ్రీబాబు.

గురువుగారు కలుగజేసుకుని అసలు ఉన్న వస్తువు కూడా ఒకటే కదా! అన్నారు. శ్రీబాబు వెంటనే మాట్లాడుతూ ఉన్న వస్తువు ఒకటే అంటావు. ఇంకొకటి లేదంటావు. మరి ఇక్కడ ఇంతమంది భక్తులు ఉన్నారు కదా! వీరంతా లేనట్లేనా? మరి ఈ ప్రకృతి అంతా లేనట్లేనా? అంతెందుకు నీ ఎదురుగా ఇక్కడ మీ సిస్టర్ ఉంది కదా! దానిని కూడా కాదనగలవా? ఉన్నది నేను ఒక్కటే అని చెప్పగలవా? అన్నారు శ్రీబాబు. శ్రీబాబు అక్కడనే ఉన్న రత్నంగారిని, ప్రసాదరావుగారిని ఉద్దేశించి మీరంతా పండితులు. అలా చూస్తూ ఊరుకుంటారేమిటయ్యా! ఆవిడ ఉన్నదంతా తాను ఒక్కటే అని వాదిస్తూ ఉంటే అన్నారు. మీరలా చెబితే ఎవరంగీకరిస్తారండీ? ఈ జగత్తు అంతా మన కంటికి గోచరిస్తుంది. దీనిని ఎలా కాదనగలం? అసలు నేను ఎవరు? అని ప్రశ్నించుకుంటే ఆ విషయం బోధ పడుతుంది. ఈ సృష్టిలో ఏ వస్తువైనా నశించేదే కాబట్టి అసత్యమైనది. సత్యమైనదీ, నశించనిదీ ఒకటి ఉన్నది. అదే ఆత్మవస్తువు. అదే నేనంటే దానికి రూపంగాని నామం గాని, క్రియగాని లేవు. కాని దానిచే ప్రకాశించబడే ఏ వస్తువుకైనా ఒక ఆవరవణ రూపం, నామము, క్రియ ఉంటాయి. అవి పరిణామం చెందేవి. అలాగే ఈ మానవుల మధ్య గల బంధాలు, ప్రేమలు అన్నీ పరిణామంతో కూడినవే. ఈ ఉపాధి నశించిన వెంటనే ఈ బంధాలు, ప్రేమలు ఏమైపోతాయి? హుళక్కే కదా! అన్నారు. -సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

## జూలై 2010

| | | |
|---|---|---|
| 6 | మంగ | శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 10 | శని | మాసశివరాత్రి. |
| 17 | శని | దక్షిణాయన ప్రారంభము. |
| 21 | బుధ | తొలిఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన. |
| 25 | ఆది | ఆషాఢ (వ్యాస) పూర్ణిమ,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన. (చాతుర్మాస్య దీక్ష ప్రారంభం) |

## ఆగష్టు 2010

| | | |
|---|---|---|
| 5 | గురు | శ్రీగురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ. |
| 8 | ఆది | మాస శివరాత్రి |
| 20 | శుక్ర | వరలక్ష్మీ వ్రతం. |
| 24 | మంగ | రాఖీపూర్ణిమ, రక్షా బంధనం, శ్రీ సద్గురుపాదపూజ |

### శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ హైదరాబాద్ శాఖలో సత్సంగ కార్యక్రమములు

జూలై 28 నుండి ఆగస్టు 1వ తేదీ వరకు పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ వారి సత్సంగములు తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపం, హిమాయత్‌నగర్, హైదరాబాద్‌లో జరుగుతాయి.

కార్యక్రమ వివరములు : ఉదయం 4 గం.లనుండి 4.30 గం.ల వరకు సుప్రభాతం, 6గం.ల వరకు ధ్యానము, ప్రార్థన 9 గం.లనుండి 10 గం.ల వరకు సంకీర్తన, 12 గం.ల వరకు ధ్యానము, శ్రీ మాతాజీ వారి అనుగ్రహ భాషణము, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 5 గం.లనుండి 6 గం.ల వరకు సంకీర్తన 8 గం.ల వరకు శ్రీ మాతాజీ వారి బోధామృతము, ప్రార్థన.

విశేష కార్యక్రమములు జూలై 30 ఉదయం 10 గం.లకు సామూహిక కుంకుమ పూజలు, జూలై 31 ఉదయం 10 గం.లకు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వారి పూజలు, ఆగస్టు 1న సామూహిక శ్రీ సద్గురు పాద పూజలు.

సంప్రదించవలసిన ఫోన్ వివరములు :

వి.వి.యస్ మూర్తి 23835153 సెల్ 9866974229

జి. జగదీశ్వర్ 2766284 సెల్ 9985666797

# సత్సంగ సౌరభం

-శివ ప్రసాద్

ఒకసారి అనంతపురంలో మేము కారులో వెళ్తున్నాము. దానిలో మీటర్ లేదు. నేను దాని డ్రైవర్‌తో, ఏమయ్యా దీనికి మీటర్ లేదుగదా, ఇప్పుడు ఎన్ని మైళ్ళు స్పీడు పోతున్నది? అని అడిగాను. అతడన్నాడు 40 కిలో మీటర్స్ పర్ అవర్ వేగంతో పోతున్నది అన్నాడు. అదేమిటయ్యా, మీటర్ లేదుగదా! నీవు 40 కిలో మీటర్లు అని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నావు? అనడిగాను. అతడు మాకొక లెక్క ఉందండీ అన్నాడు. కారు నడిచేటప్పుడు డబడబా శబ్దం వస్తే 25 కి.మీ. వేగం పోయినట్లు. కాని దాని డోర్లు ఉన్నై గదా అవి గనక ఊడితే 60కి.మీ. వేగంతో పోయినట్లు ఇక టాప్ లేచిపోతే 100కి.మీ. వేగం అండీ అన్నాడు. మనం చేసే పనులు అలా ఉంటై. అటువంటి స్పీడ్ పనికిరాదు. శనైశ్శనైరుపరమేత్. మెల్లమెల్లగా ధ్యానం చెయ్యాలి.

ధ్యానమంటే తపస్సే అన్నారు వ్యాసులవారూ, మా గురుదేవులూ. నేను మా గురుదేవుల వద్ద వ్యాసాశ్రమంలో ఉన్నప్పుడు వారి పూరికుటీరం ఉండేది, ధ్యాన నిష్ఠాశ్రమం అని. వారు సాయంత్రం మారేడు చెట్టుక్రింద కూర్చొనేవారు. సాయంత్రం బోధ అయిపోయాక 6గం.లకు నేను స్వామివారిని తీసుకెళ్ళి వారి కుటీరంలో వదలి వచ్చేవాణ్ణి. ఆ రోజు అలాగే తీసుకెళ్ళి వెనక్కు రాబోతుంటే, స్వామివారు కూర్చో అన్నారు. నన్ను కూర్చోబెట్టి ఆ రోజు వారు ధ్యానాన్ని గురించి చెప్పారు. అందుకే చెప్పారు. గురువు వెంటన్నా ఉండాలి, వింటూ అన్నా ఉండాలి అని. వారికి ఏ సమయంలో అనుగ్రహం కలుగుతుందో మనకు తెలియదు. అనుగ్రహం కలిగినప్పుడే బోధ వస్తుంది మనకు వారినుండి. నన్ను మారేడు చెట్టుక్రింద కూర్చోమని, ధ్యానాన్ని గురించి, తపస్సును గురించి చెప్తూ వారన్నారు, తపస్సంటే వేరే ఏమీ లేదు. వ్యాసులవారు చెప్పారు, నాస్తి ధ్యానాత్ పరంతపః అని. తపస్సు అంటే, ధ్యానానికి మించిన తపస్సు లేదు అన్నారు.

దేనిని గురించి ధ్యానం చెయ్యాలి? నీ స్వరూపాన్ని గురించి ధ్యానం చేయి. ప్రారంభ స్థితిలో సాకార, సగుణ ధ్యానం గురించి చెప్పారుగాని, అందులోనే ఎల్లకాలం ఉండిపొమ్మని ఎక్కడా చెప్పలా. సగుణధ్యానం కొంత వరకే. పైమెట్టు ఎక్కేంత వరకే క్రింద మెట్టు, పైమెట్టు ఎక్కి తర్వాత కూడ ఎవడన్నా క్రింద మెట్టునే పట్టుకొని ఉంటాడా? ఎవడో బావిలో పడ్డాడు. వాడికి

ఆ బావిలో ఒక ఊడ ఆసరా దొరికితే దానిని పట్టుకొని నీళ్ళలో మునిగిపోకుండా వేళ్ళాడుతున్నాడు. ఎవరో చూసి పైనుండి ఒక త్రాడు లోపలికి దించుతూ, ఇదుగో తాడు దించుతున్నాను, అది పట్టుకొని పైకెక్కిరా అన్నాడు. ఇంతవరకు నన్ను నీళ్ళలో మునగకుండా రక్షించింది ఈ ఊడకాబట్టి, ఈ ఊడను నేను వదలి పెట్టను అన్నాట్ట ఆ దరిద్రుడు. ఊడ ఎంత వరకు? తాడు వచ్చేంతవరకే ఊడ ప్రయోజనం. తాడు వచ్చిన తరువాత ఊడను వదలిపెట్టి, తాడును పట్టుకోవాలి. అలాగే సగుణబ్రహ్మం ధ్యానం ఎంత వరకు? కొంతవరకే ప్రారంభ స్థితిలోనే. సగుణాన్ని వదలి నిర్గుణానికి వెళ్ళాల్సిందే. సగుణధ్యానం ధ్యానమే కాదన్నారు. సగుణ బ్రహ్మము ఏమి బ్రహ్మము?

అది దేశకాల పరిచ్ఛిన్నమైనది. రామకృష్ణాద్యవతారాలన్నీ, దేశంతో, కాలంతో వస్తువుతో పరిచ్ఛిన్నమైనవి. ఈ దేశంలో ఉంటే, ఆ దేశంలో, ఈ కాలంలో ఉంటే ఆ కాలంలో లేవు. కృష్ణుడు ద్వాపరయుగంలో ఉన్నాడు. త్రేతాయుగంలో ఉన్నాడా? రాముడు అయోధ్యలో ఉన్నాడు. అళందిలో ఉన్నాడా? లేడు. అలా వారందరూ దేశకాల పరిచ్ఛిన్నులు. రాముడు కృష్ణుడు కాదు. కృష్ణుడు రాముడు కాదు. వస్తు పరిచ్ఛేదం వచ్చేసింది. ఆ కాలంలో ఉంటే ఈ కాలంలో లేరు. కాలపరిచ్ఛేదం వచ్చేసింది. ఆ దేశంలో ఉంటే ఈ దేశంలో లేరు. దేశ పరిచ్ఛేదం వచ్చేసింది. అందువలన వాళ్ళెవరూ దేవుడు కాదు. దేవతలు మాత్రమే.

కాని, రాముడిలో కృష్ణుడిలో ఉండే చైతన్యము పరబ్రహ్మ వస్తువు. సగుణాన్ని ధ్యానం చేసేటప్పుడు ఏమి చెయ్యాలి? రాముణ్ణి ధ్యానం చేసేటప్పుడు రాముడిలోని పరబ్రహ్మ తత్త్వాన్ని ధ్యానం చెయ్యాలి. రాముడు నిర్వికారుడు, నిరామయుడు... ఆ రామునిలోని పరబ్రహ్మ తత్త్వాన్ని ధ్యానం చెయ్యాలి. ఆ రాముడిలో ఉన్న పరబ్రహ్మ తత్త్వమూ నీలో ఉన్న పరబ్రహ్మ తత్త్వము ఒకటేరా అని చెవులో ఇల్లు కట్టుకొని చెప్తున్నారు మహాత్ములు. అన్ని ఉపాధులలోని ఉపాధిగత చైతన్యం ఒక్కటే. అదే బ్రహ్మతత్త్వం. అదే అహం. దానిని గుఱించి ధ్యేయాయాః చింతనం ధ్యానం. ఆ పరబ్రహ్మ వస్తువే, అంటే నీవే, మానవ జీవితానికి ధ్యేయం అన్నారు.

దానిని గుఱించి ధ్యానం చేయాలి. ఎలా చెయ్యాలి. పతంజలి మహర్షి యోగసూత్రాలలో చెప్పారు. తత్ర ప్రత్యైకతానతా ధ్యానం అని. ప్రత్యయా, ఏకతానతా ధ్యానం.

-సశేషం

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

**జ్ఞాన -** నామదేవా! నీవు హర్షశోకాలకు అతీతుడవై స్థితప్రజ్ఞావస్థకు చేరుకోవాలి. ఏది పుడుతుందో అది నశిస్తుంది. అది మాయవలన ఉన్నట్లు భాసిస్తుంది. అలా కనిపించి నశించేవి లేనివే. ఉన్నది ఎప్పుడూ ఉన్నది. శాశ్వతమైనది, నిత్యమైనది ఉద్భవించదు, నశించదు. అది చిరంతనం.

పౌర్ణమినాడు నివృత్తినాథ్ సోదరులు, ముక్తాయి అళందికి బయలుదేరారు. పంఢరి భక్తులు వారి టెక్కెంపైన జండా కనిపించే వరకు అలా చూస్తూ ఉండిపోయారు. అవి అదృశ్యమైన తరువాత కూడా నామదేవుడితో పాటు అందరూ స్తబ్ధంగా చూస్తూ మౌనంగా ఉండిపోయారు. అంతలో ఆ ప్రశాంతతకు భంగం కలిగిస్తూ ఒక చిన్న పక్షిపిల్ల ఆర్తనాదం గుండెలను చీలుస్తూ వినిపించింది. జ్ఞానదేవుణ్ణి ఆహారం తేవటానికి వెళ్ళిన తల్లి పక్షిణిలా, తనను ఆ తల్లి పక్షిణి కోసం, ఆ తల్లి తెచ్చే ఆహారం కోసం ఎదురు చూస్తున్న పిల్లపక్షిలా భావించుకున్న నామదేవుడి నోటివెంట అతనిలోని ఆవేదనంతా అసంకల్పితంగా అభంగ రూపంలో వెలువడింది.

ప్రొద్దుటే మేతకోసం గూడు వదలిపోయింది పక్షిణి
చిన్నపిల్లలు ఉపవాసంతో తల్లి రాకకై నోళ్ళు తెరుచుకుని ఎదురు చూస్తున్నై
అలా అయింది నా పరిస్థితి
నా మనస్సు నీ రాకను ఆకాంక్షిస్తున్నది. ఆ చిన్న పక్షి పిల్లలవలె

కార్తీక త్రయోదశినాడు ఉదయమే జ్ఞానదేవుడు స్నానం చేసి, శుచియై సజ్జనులకందరికీ ప్రణిపాతం చేసి సిద్ధేశ్వరాలయం వద్ద తనకు ఏర్పాటు చేసిన సమాధిస్థలం చేరాడు. తన సద్గురు దేవులైన నివృత్తినాథ్‌కు, పాండురంగ స్వరూపుడైన నామదేవుడికి నమస్కరించి ఆసనంపైన పద్మాసనంలో కూర్చున్నాడు. నిర్గుణ నిరాకార పరబ్రహ్మం యొక్క సాకార పాండురంగ స్వరూపమే అయిన నామదేవుడు "జ్ఞానదేవా! సూర్య, చంద్ర, తారకలు, ఆకాశం ఉన్నంతకాలం నీ ఈ సమాధి సుస్థిరంగా ఉండుగాక. కల్పాంతమున నీవు యథాకాలంలో నా స్వరూపంతో ఏక స్వరూపుడవు కాగలవు. ఈ భూమిపైన

ఎవరు నీ నామాన్ని నిరంతరం జపిస్తారో వారు పూర్ణజ్ఞానులు అయ్యెదరు గాక!" అంటూ ఆశీర్వదించాడు. జ్ఞానదేవుడు భీమముద్ర ధరించాడు. జ్ఞానదేవుడిలో నుండి దివ్య కాంతులు వెలువడ్డాయి. నివృత్తినాథ్, నామదేవుడు సమాధిపై శిలను ఉంచారు. సమాధిద్వారం మూయబడింది. సిద్ధేశ్వరస్వామి ఎదుట ఉండే తెల్లని నందీశ్వరుడు సమాధి ద్వారం వద్దకు చేరి అక్కడే స్థిరపడిపోయాడు.

మార్గశిరమాసంలో జాహ్నవి, భోగవతి, మందాకినిల త్రివేణీ సంగమం వద్ద సిద్ధవటేశ్వరంలో సోపాన దేవుడు సమాధిలోకి ప్రవేశించాడు. గుహద్వారం దానంతటదే మూసుకున్నది.

వైశాఖ దశమి. అందరూ తాపి నదిలో స్నానం చేశారు. ఆకాశమంతా నల్లని కారుమబ్బులు దట్టంగా కమ్ముకుని ప్రళయకాలంలో వలె మెరుస్తూ గర్జిస్తున్నాయి. ఈదురుగాలులు ఝుంఝూమారుతంలా వీస్తున్నాయి. ఒక పెద్ద గాలిదుమారం లేచి ఆ ప్రాంతం అంతా దుమ్ముతో ధూళితో దట్టంగా నిండిపోయింది. కన్ను పొడుచుకున్నా కనపడని గాఢాంధకారం. అంతలో ఒక్కసారిగా చెవులు చిల్లులు పడేలాగ ఘంటానాదాలు, ఉరుముల పిడుగుల ధ్వనులు అంతాటా మారుమ్రోగాయి. ఉన్నట్లుండి కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతితో కళ్ళు పోతాయేమో అన్నట్లు కోటిసూర్య ప్రభలను వెదజల్లుతూ ఒక మెరుపు మెరిసింది. అంతే ఆ తరువాత ముక్తాబాయి ఎవ్వరికీ కనబడలేదు.

తమ గురుదేవులైన గహనీనాథ్ అనుజ్ఞతో నివృత్తినాథ్ జ్యేష్ఠ వద్య ద్వాదశినాడు సమాధిస్థితులైనారు.

ఒకనాడు ప్రొద్దుటే కాకడారతిలో ఉండగా చోఖామేళుడు రంగడిలో లీనమైనాడన్న పిడులాంటి వార్త వచ్చింది. నామదేవుడు తల్లడిల్లి పోయాడు. చోఖా విఠలుడిలో లీనమైన సంవత్సరం తరువాత పండరిపురంలో ఏకాదశినాడు గుమికూడిన భక్తులు వైశాఖ వద్య పంచమి, చోఖామేళ పుణ్య తిథికి ఆ భక్తుడి అవశేషాలను సమాధిచేయాలి అని నిర్ణయం చేశారు. నరహరి సోనార్ సమాధికి రూపకల్పన చేయటానికి ముందుకు వచ్చాడు.

అంతా సిద్ధమైంది. ముహూర్తానికి గునపం వేయటానికి పరిసా గునపం పైకెత్తాడు. "ఆగండి త్రవ్వకండి" పూజారి శంభోభట్టు పరిగెత్తుకుంటూ వచ్చి అతి కర్కశమైన కంఠంతో గట్టిగా అరిచాడు.

**శంభో** - ఇది మా స్థలం. మా దగ్గర ఈ అగ్రహార దానపత్రం ఉన్నది.

ఇక్కడ ఒక మాలవాడి సమాధి కట్టి దీనిని అపవిత్రం చేయటానికి వీలులేదు. ఒక వెయ్యి బంగారు నాణాలు ముందు కడితే తరువాత మొదటి గునపం వేసుకోవచ్చు.

**పరిసా -** అదేమిటి! ఇప్పుడేగా మాలవాడి సమాధి..... అపవిత్రం........ ఏదో అన్నారు..... ఇంతలోనే..... !

**శంభో -** డబ్బు కడితే అభ్యంతరం లేదు. బంగారానికి అంటు లేదు. ఒక రాగి చెంబుడు నీళ్ళు పోస్తే అది పవిత్రం అవుతుంది.

**సేనా -** (వెక్కిరింపుగా) అయితే మూడుపూటలా ఆ రాగి చెంబుతో బుడి బుడి స్నానాలు చేసే మీరు ఇంకా అపవిత్రంగానే ఉన్నారేం?

**నామ -** సేనా! బాహ్యంగా ఎన్ని వెంట్రుకలు గొరిగితే మాత్రం ఏం లాభం? అవి మళ్ళీ పెరుగుతాయి. తలలు బోడులైనంత మాత్రాన తలపులు బోడులు కావు. అంతశ్శుద్ధి ఉండాలి. అన్నం నీళ్ళు మాని ఇక్కడే కూర్చుని భజన చేద్దాం. విఠలుడి ముందు ఒక మహాభక్తుడి సమాధి కట్టటానికి ఈ అడ్డంకులు ఏమిటి? విఠలుడు కరుణించేదాక, విప్రుల మనస్సు మారేదాక నిష్ఠ వీడకూడదు.

**శంభో -** (చకచకా మందిరం వైపు నడుస్తూ) మీరు ఉపవాసం ఉంటారో, సజీవ సమాధి చేసుకుంటారో, చెక్క భజన చేసుకుంటారో మీ ఇష్టం. వెల ఇవ్వందే మాత్రం ఈ చోటు మీకు దొరకదు.

నామదేవుడు సంకీర్తన మొదలు పెట్టాడు. భక్త బృందం తాళం, మృదంగం వాయిస్తున్నారు. సూర్యుడు నడినెత్తికి వచ్చాడు. అపరాహ్ణం అయింది. వైశ్వదేవం ముగిసింది. శంభో భట్టుగారు విస్తరి ముందు స్వయంపాకం పెట్టుకుని కూర్చొని భార్యనుద్దేశించి ‘ కానివ్వవే ! త్వరగా వెళ్ళాలి. అక్కడ వాళ్ళు మన స్థలం అన్యాయంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నారు’ అన్నాడు. భార్య మౌనంగా విస్తట్లో అన్నీ వడ్డించింది. భట్టుగారు విస్తరి చుట్టూ నీళ్ళు త్రిప్పి చిత్రాహుతి పెట్టటం కోసం అన్నం పట్టుకోబోయాడు.

-సశేషం

## టీ.వీలో శ్రీమాతాజీవారి కార్యక్రమాలు

**శ్రీ మాతాజీవారి కార్యక్రమములు భక్తి మరియు టి.వీ -(1) ఛానల్స్‌లో ఉదయం 5గం॥30ని॥ నుండి ప్రసారమౌతున్నాయి. భక్తులు విని తరించ గలరు.**

# కృష్ణతత్వము, ప్రేమ యోగము

(గతసంచిక తరువాయి) - సుషుమ్న ప్రసాద

మధుర గాన వాహినిలో కరిగిపోయి ఉనికిని కోల్పోయిన భామామణులు, దివ్య తేజస్సుతో భాసిల్లే బాలకృష్ణుని ముఖారవిందమును మూర్కొనే హిమబిందువుల్లా, ముత్యాల కోవల్లా ప్రకాశించారు. వారు పొందిన దివ్య రసానుభూతి భాషాతీతము భావాతీతము. గోపకాంతల, గోపీ మనోహరుని హృదయాలనుండి పొంగి పొరలి, వెల్లువై ప్రవహించే ప్రేమామృత వాహిని యే రాసక్రీడ. దివ్య రసజ్ఞతకు గీటురాయి. గోపికామతల్లులు మధుర ప్రేమయనే కిరీటమునకు కీర్తినిచ్చే మణిదీపికలు. అలా పరిపూర్ణతమమైన కృష్ణలీలతో శోభిల్లిన వ్రేపల్లె వాడను వదలి, యశోదమ్మ మురిపాలకన్నయ్య కంస సంహారము కోసం మధురానగరి ప్రవేశించాడు. ప్రేమతత్వానికి శిఖరాగ్రమైన అత్యంత ప్రధానమైన ప్రథమోధ్యాయము ముగిసింది.

కృష్ణ ప్రేమలో సంకుచితత్వమునకు శారీరక వ్యామోహమునకు తావులేదు. ఆత్మ సౌందర్యమునకే కృష్ణ పరమాత్మ నీరాజనమిచ్చాడు. కురూపియైన కుబ్జను కృష్ణ ప్రేమ తరంగములలో జలకమాడించి, దివ్య సౌందర్యమును ప్రసాదించాడు, అయితే భౌతిక సౌందర్యము కాని, సంపద కాని, ఉన్నత స్థాయి కాని ఏమీ లేవు. అలాగే జీర్ణ వస్త్రధారియై, బహు కుటుంబీకుడై, బక్కచిక్కిన బాపనయ్య అగణితమైన కృష్ణ ప్రేమ సంపదకు, నిత్య వారసుడయ్యాడు. అతనే కుచేలుడు. స్వయంగా పాద ప్రక్షాళనము చేసి, ఆలింగనము చేసుకొని, బిక్కుబిక్కుమంటూ భయపడుతున్న, ఆ బీద బ్రాహ్మణుని, తన ఉన్నతాసనముపై కూర్చుండబెట్టి సపర్యలు చేశాడు. కృష్ణ పరమాత్మ. అది ఆదర్శమైన సఖ్య ప్రేమకు తార్కాణము.

కృష్ణ పరమాత్మ సనాతనుల్లో సనాతనుడు. అధునాతనుల్లో అధునాతనుడు. నూతనత్వమునకు ప్రతిరూపం. వైకుంఠమును వీడి భువికి దిగి వచ్చిన శ్రీమహాలక్ష్మి, రుక్మిణీ దేవి రూపుదాల్చి, కృష్ణ పరిష్వంగమునకై పరితపిస్తుంది. ఆ ప్రేమ తపస్విని తన ఎదలోని వ్యధను, ప్రేమాతిశయమును లేఖ రూపంగా పొందుపరిచి, ఆ ప్రేమ సందేశమును అగ్నిద్యోతనుని ద్వారా కృష్ణభగవానున కందజేస్తుంది. భక్తుని ఆవేదనను భగవంతుడు మాత్రమే గ్రహించగలడు. ప్రేమ తపస్విని ఆవేదనను, ప్రేమయోగ యోగీశ్వరుడయిన కృష్ణ పరమాత్మ మాత్రమే గ్రహించగలడు. ప్రేమ పర్యవసానము పరిణయమని

నిరూపించటానికి, వెంటనే ఒంటరిగా హుటాహుటిగా విదర్భ నగరానికి తరలి వెళ్ళాడు. ప్రేమకు హద్దులు లేవని నిరూపిస్తూ, వైదర్భిని, వినూత్న రీతిలో వివాహమాడిన విశిష్ట ప్రేమ యోగి వంశీమోహనుడు. భామలందరూ, భవలతలను త్రుంచి భగవానుని బాహుబంధములో, తమ ఉనికిని మరిచి, తరించాలని తపించిన వారే. భామల హృదయాలను దోచుకొన్నాడే కాని ఏ భామనూ బలవంతంగా చేపట్టలేదు, బ్రహ్మానందమును ప్రసాదించే ఆ సద్బ్రహ్మచారి. స్వామిలోని ప్రత్యణువు ప్రేమతోనే పొంగిపొర్లింది. లింగ, వర్గ, వయోభేదాల కతీతమైనది కృష్ణప్రేమ. తనను ప్రేమించిన వారినేగాక, ద్వేషించిన వారిని కూడ తనలో లయం చేసుకొన్నాడు.

ఇక తన మిత్రుడు, ఆప్తుడు, భక్తుడైన అర్జునుని తరింప చేసిన ప్రేమ భాషకు అతీతము, భావాతీతము. కృష్ణార్జునులు ........స్వరూపమే. దీపాన్ని, దీపకాంతిని విడదీయలేనట్లు, కృష్ణజ్యోతి కాంతి కిరణమే అర్జునుడై భాసిల్లింది. అందుచేతనే కృష్ణ భగవానుడు తన దివ్యగాన మధురిమను ఒక అమూల్యమైన ఆధ్యాత్మిక మణిమాల భగవద్గీతను జగత్తుకు ప్రసాదించటానికి కారణ భూతునిగ, కేంద్రబిందువుగ, కిరీటిని నిలబెట్టాడు. గీతామృతమనే అమర ప్రేమను జుర్రుకోటానికి, ఆదర్శ శిష్యునిగ నిలబెట్టాడు అర్జునుని. కృష్ణార్జునుల ప్రేమ తత్వము అతిలోక సుందరము. శ్రీ కృష్ణ పరమాత్మకు ప్రేమాభిషేకము చేసిన భక్తులు చరిత్రలో ప్రసిద్ధికెక్కినవారు, అజ్ఞాత భక్తులనేకమంది ఉన్నారు. అలా తన భక్తుల ప్రేమకు పరీక్ష పెట్టటమనేది ప్రేమాధిపతి కృష్ణభగవానునికి మనోజ్ఞమైన లీల. ప్రవీరుడనే భక్తుని అద్భుతమైన దివ్య ప్రేమ స్వామిలీలలో అగ్ర తాంబూలాన్నందుకొన్నది.

మహిష్మతీ రాజ్యమును నీలధ్వజుడనే రాజు పరిపాలించేవాడు. ఆయన ధర్మపత్ని జన్వాదేవి. ఆ రాణి పతిభక్తికి, సౌశీల్యమునకు మారుపేరుగా ఉండేది. భగవంతునియందు దివ్య ప్రేమ, భక్తి విశ్వాసములతోపాటు, ఎంతో ఆత్మ గౌరవము, ధైర్యము, సహనములతో క్షత్రియ ప్రజ్ఞ నిరూపించేది. వారి ఏకైక పుత్రుడు ప్రవీరుడు. తల్లి శిక్షణలో పెరిగిన ప్రవీరుడు, మాతృమూర్తి సుగుణాలనన్నిటిని పుణికిపుచ్చుకొని, ద్విగుణీకృతంగా భాసిల్లుతున్నాడు. ప్రవీరునిలోని ప్రత్యణువు ధైర్యసాహసములకు నెలవై వెలుగొందింది. అతని మనసు కృష్ణ నామస్మరణతో పవిత్రతను సంతరించుకొని, దివ్య ప్రేమామృతముతో నిండిన మధుర భాండముగా మారింది. -సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

"ఆ లీలా కిశోరుడెవరనుకుంటున్నారు? సకల చరాచరములకు నాధుడైనవాడు. జగత్కారణ శక్తి అయిన ఆ పరబ్రహ్మము నేడు వ్రజవాసి అయి బాలగోపాలుడైనాడు. వాని కరచరణాలను, చదువుకున్నవారు మీ అందంతో పోల్చారుగాని మీకన్నా ఎన్నోరెట్లు మిన్న అయిన అద్వితీయ సౌందర్యానికి అవి మూలాలు. సాధుజనమనోభృంగాలకు జ్ఞాన మకరందాన్నందించే బ్రహ్మానందామృత నిలయాలు. మీ తావున అవతరించిందని గర్వించి విర్రవీగుతున్న మీరు ముల్లోకాలలో నిండిన ఆ మహాలక్ష్మి ఆ పరమాత్ముని పాదాల నాశ్రయించి సేవించుకుంటూ ఉంటుందనే సత్యం గుర్తించండి.'' కమలాలకిలా హితబోధ చేసిన కమలాప్తుడు సమయమైనందున పశ్చిమదిక్కున అంతర్ధానమైనాడు. తాతగారు చూపిన బాలగోపాలుని తామరలన్నీ కళ్ళు బాగా విప్పార్చి చూశాయి. వాని తనువంతా తేజోమయమై వెలిగిపోతున్నది. వాని అవయవ సౌందర్యం ముందు తమ అందాలు వెలవెలబోతున్నట్లు అనిపించింది. తమ ఇంటి ఆడపడుచు స్వామి విశాల వక్షస్థలంలో ఒదిగి ఉంది. అరవిందాలన్నీ తమతమ అవివేకాన్ని తెలుసుకుని తమలోతాము సిగ్గుపడి ముడుచుకుపోయాయి.

సూరన్న బండిదిగాడు. పెళ్ళయిన తరువాత తొలిసారిగా అత్తవారింటికి తీసుకొచ్చిన తన భార్య మందాకిని బండి దిగటానికి చెయ్యి అందించాడు. మెడలో గంటలు గణగణ మోగుతుంటే జోడెద్దుల బండి వచ్చి ఇంటిముందు ఆగినపుడు ఎత్తుగా ఉన్న బండిలోంచి దిగేందుకు ఎత్తు పీట వేశారు. కొత్త పెళ్ళికూతురుకి వాతావరణమంతా కొత్తగా ఉన్నందున సిగ్గ పడుతూ సంకోచిస్తూ తలవంచి పారాణి పాదాలను ముందుకు జాపి దిగటానికి సిద్ధ పడుతూ వాల్చిన కనురెప్పల వెనకనించి కిందికి చూసింది. తను కాలూనబోయిన తావున పీటమీద ఎంతో ముద్దుగా చెప్పలేనంత అందంగా గోరింటాకు ఎరుపు కడియాలు, అందెలు, బంగారు గజ్జెల మెరుపుని మించిన అపురూపమైన వెలుగులు నిండిన చిరుపాదాల జంటను చూసి ఆగిపోయింది. ఆ క్షణానే తల ఎత్తి పాదాలమీంచి పైకి దృష్టి సారించింది. నీలిరంగు ఒళ్ళు, చంద్రుణ్ణి ధిక్కరించే సొగసైన ముఖం మబ్బుల్లో దోబూచులాడే చందమామలాగ అగపడె ఆ సోయగాలకి పరవశించి పోయేంతలో "దిగుదిగు భయంలేదు నేను పట్టుకున్నాను కదా!" అని పెనిమిటి తొందరచేస్తూ ముందుకు

వచ్చి అడ్డంగా నిలిచినందున ఆ దివ్యమూర్తి కనుచాటయి మరి కనబడలేదు. ఎంత చిత్రం! సరిగా చూడలేకపోయినా ఆ రూపం మనస్సులో అచ్చు పడి మర్చిపోలేని అనుభవంగా మిగిలిన మందాకిని అత్తవారింట అడుగు పెట్టింది. ఆ తరువాత తన మనస్సులో మిగిలిపోయిన సందేహాన్ని భర్తముందు వెలిబుచ్చుతూ “నేను బండి దిగేముందు అక్కడ నాకు కనిపించిన.... అని అడగబోయేంతలో “అదా! అది మనింట్లో ఈ మధ్యనే పుట్టిన లేగదూడ. నాకు బాగా మాలిమి అయినందున నాకోసం బండి దగ్గరికి వచ్చేసింది. నువ్వు నగరవాసివి గనుక మీ మధురలో ఇలాంటి లేగదూడలు ఎడ్లబళ్ళు పాలకావిళ్ళు ఇవన్నీ చూసి ఉండవు. మా పల్లెకు ఇవే చెప్పుకో దగిన సంపద.’’ అన్నాడు. అది విని మందాకిని అనుకుంది. తను చూసిన ఆ సుందరమూర్తిని పెనిమిటి చూడనేలేదేమో! అయితే ఇదెలా సంభవం? ఇది నిజమా? తన భ్రమా!

నాటినించీ మందాకిని తమ ఇంటికి వచ్చిపోయే బంధువులలోగాని స్నేహితులలోగాని ఆ ముద్ర కనిపిస్తుందేమోనని వెతకసాగింది. కోడలిని గడప దాటనివ్వని అదుపాజ్ఞల్లో మసలే మందాకినికి బైట ప్రపంచంలో చూసే అవకాశం లేక మనస్సులో నిలుపుకున్న ఆ రూపాన్ని క్షణక్షణం తలుస్తూ తపిస్తూ అదే ధ్యాసలో ఉండిపోయింది. ‘ఎప్పుడు ఎలాగ ఎక్కడ తిరిగి చూడగలను అనే చింతలో మునిగిపోయింది.

సందెవేళ మందాకిని వాకిట్లో ముగ్గేస్తున్నది. ఆలమందలు అంభారవాలతో అడవులనించి మరలి వస్తుంటే ఆతావునంతా గోధూళి కమ్ముకున్నది. పొగలాగ నిండిన ఆ దుమ్ముతెర వెనకగా మసకమసకగా ఎన్నో రూపాలు తరలిపోతూ కనిపించాయి. అలాగ చూస్తూ నిలచిన ఆమె చెవులలో సన్నగా మువ్వల సవ్వడి ఆ వెనకే ‘మందాకిని ఏదిరా గోపన్నా’ అనే మధుర స్వరమూ వినవచ్చాయి. నాలుగడుగులు త్వరగా నడిచి ముందుకి వచ్చింది మందాకిని ‘కపిల, గంగ, గౌతమి అన్నీ ముందుకి వెళ్ళిపోయాయి గాని మందాకిని వెనకబడిందిదిగో కన్నయ్యా’ అనే సమాధానం వింటూ అవి గోవులని అర్థంచేసుకుంది మందాకిని. అస్పష్టంగా కనబడి స్వరం వినబడి అంతలోనే తెరమీద బొమ్మలలాగ కదిలిపోయిన ఆ మూర్తి తననింత నిరీక్షణకు, ఆవేదనకు గురిచేస్తూ తన మనస్సులో ఆడుకుంటున్న ఆటా ఇది నాటకమా? మందాకిని కళ్ళలో నీరు చెంపలమీదుగా జారిపోయింది.

- సశేషం

# మౌనధ్యాన సప్తాహశిబిరం

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

**హృదయమె శివ మందిరమని మొదలు తెలియవే మనసా**
**మాయయను కవాటము ఆ మందిరమును మూసినదే ॥హృద॥**
**శివుడే సద్గురు రూపము స్వీకరించి వచ్చెనే**
**తన కృపా ప్రసారమ్మున ద్వారమ్మును తెరచునే**
**తన బోధల వెలుగున శివదర్శనమ్ము చేయించునె ॥హృద॥**

ఎన్నిసార్లో వింటున్నాము ఈపాట. మనందరి పుస్తకాలలోనూ ఉంది. తెలియని మస్తకం కూడ లేదు. అసలు అది గుర్తించామా? గుర్తిస్తే కలకలం వస్తుందా మనస్సుకు? హృదయంలో ఉన్నవాడే శివుడు, నా హృదయమే మందిరమై ఉన్నది. అనేటువంటి గుర్తింపు వస్తే, మానవుడు వేరు వేరు బాధలకు లోనౌతాడా? ప్రక్కవాళ్ళు మాట్లాడనీ, ఇంట్లోవాళ్ళు మాట్లాడనీ, ఎదుటివాళ్ళు మాట్లాడనీ, ఆస్తి గొడవలు రానీ, మాటల గొడవలు రానీ, శబ్దకాలుష్యంకానీ దీనికంటె ఎక్కువ ఏమైనా ఉన్నదా? ఎందుకని హృదయాన్ని మలినం చేసుకుంటున్నాము? హృదయం మలినం అవటంలా. మనస్సు మలినం చేసి, హృదయంలో ప్రకాశించే, ఆ అంతరాత్మలో ప్రకాశించేటువంటి ఆ భగవంతుణ్ణి మనం గుర్తించలేకపోతున్నాము, అవగాహన లేక. కబుర్లతో సరిపెట్టి చెప్పటానికి వ్యాస పరాశరాదులంత గొప్పవారే, కాని ఆచరణ పద్ధతిలోకి వచ్చేసరికి అక్కడ దానికోసం అలమటించి పోతున్నాము. పిల్లవాడు ఒళ్ళో ఉన్నప్పటికి, ఆకలి బాగా వేస్తూ ఉండాలి. ఆకలి వేస్తేనే అమ్మ పాలకోసం వెతుక్కుంటాడు. ఆకలి వేయకపోతే వాడికి పాలతో అవసరంలా. బొమ్మలుంటే చాలు. ఆడుకోటానికి తోటి వారుంటే సరిపోతుంది. అలాగే మనంకూడ నిజమైన ఆకలి కలిగి ఉండాలి. అసలీ జీవితం ఎందుకు వచ్చింది? ఈ దేహం ఎందువల్ల కలిగింది? సూటిగా మాట్లాడుకోవాలంటే శ్రీ గురుదేవులు ఒక మాట అంటుండేవారు. ఏమని? మూడు సార్లు తినటానికి, ఆరుసార్లు వెళ్ళటానికా? ఈ జీవితం వచ్చింది ఇందుకేనా? ఇంతకన్న ఏమీ సమాధానము లేదా దీనికి? ఒక్కసారి ఆలోచించుకోండి. ఈ జీవితం పోతే మళ్ళీ ఇటువంటి జీవితం వస్తుంది, ఈ మాత్రము ఇటువంటి మహాత్ముల సన్నిధి దొరుకుతుంది అని మీరు గ్యారంటీ చెప్పలేరు. అందుకని పద్మం క్రింద కప్పలాగా ఉండవద్దు.

దానిలో ఉన్న మకరందాన్ననుభవించేటువంటి తుమ్మెదలాగా ఉండాలి.

ఇక్కడ హృదయమె శివ మందిరమని మొదలు తెలుసుకో. మాయ అనే కవాటం దానిని కప్పి ఉన్నది. అది అందరకూ తెలుసు. ఎవరైనా మాట్లాడేస్తారు చూడండి 'మాయ' అంటారు. ఏం చస్తామా, మాయ మరి అంటారు. చెప్పుకోటానికి ఈ కీర్తనను ఇవ్వలా గురుదేవులు. చెప్పుకోటానికి కాదు. అది మాయ కనుక, మాయ జోలికి వెళ్ళకుండా ఉండటంకోసం చెప్పారు. మాయ అనే కవాటం ఆ మందిరమును మూసి ఉన్నదని తెలిసిందిగా. ఇప్పుడు దాన్ని తెరవాలి.

**మాయయను కవాటము ఆ మందిరమును మూసినదే**

కాని మందిరంలో ఎవరున్నారు? శివుడే సద్గురు రూపమును స్వీకరించి వచ్చెనే. వారికేంటి అవసరం అసలు? వారికి అవతారం ధరించాల్సిన అవసరం ఏమున్నది? ఇక్కడికి వచ్చి మనలను అనుగ్రహించి దర్శనం ఇవ్వాలని ఏమున్నది? ఎక్కడ ఉంటే కుదరదు వారికి? ఈ మాయను తొలగించటం కోసరం.

**ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవచ ।**
**క్షరస్సర్వాణి భూతాని కూటస్థో z క్షర ఉచ్యతే ॥**

ఆ లోపల ప్రకాశించేవాడు ఎవడు? అక్షర స్వరూపుడు. ఇప్పుడు మనం ఎందులో ఉండి సరిపెట్టుకుంటున్నాము? క్షరమైన దానిలో ఉండి సరిపెట్టుకుంటున్నాము. నాశనం చెందే ప్రపంచంలో ఉండి ఇందులో ఇది చూస్తూ, మనం సరిపెట్టుకుంటూ ఉంటే, దీనివలన వచ్చేది బాధకాక ఆనందం వస్తుందా?

-సశేషం




పెదనింద్రకొలను పాఠశాలలో విద్యార్థులకు ఆశ్రమ ట్రస్ట్ వారు నోట్‌బుక్స్ వితరణ చేస్తున్న దృశ్యం

# మాతాజీ బోధామృతం

(గతసంచిక తరువాయి) - శివ ప్రసాద్

( శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయంలో ది. 28-09-09 శ్రీ మాతాజీవారి అనుగ్రహ భాషణకు సంగ్రహ రూపం)

ఎక్కడ ఎలా ఉన్నా ప్రశాంతంగా ఉండటమే ముక్త స్థితి, అయ్యో! ఇంత పెద్దవాళ్ళమయ్యామే కాని ఇంకా ఆయనను ఆకర్షించలేక పోయామే అనుకుంటారు కొందరు. యధామతి స్తధా గతిః. ధర్మాన్ని అతిక్రమిస్తే, మానవ జన్మకు అర్థంలేదు. మన స్థితి, ఏది వచ్చి మనపైన బడ్డా, తానొవ్వక, ఇతరులను నొప్పింపక, ప్రశాంతంగా బ్రతకటం.

ప్రేమతో ధనమెంతో కూడ బెట్టినా, కాసైనా నీ వెంటరాదు. మరి ఎందుకు వీటిని కోరుకుంటున్నాము. ఇది హెచ్చరిక. విత్తం లేదు, లేదు అనుకుంటాము. ఎంత ఉంటే అంత తృప్తిపడేవాడే అదృష్టవంతుడు. లేకపోతే లెక్కపెట్టుకోటం, లాకర్లలో, బీరువాలలో ఉంచి తాళాలకు పూజ చేయటంతో సరిపోతుందా? ఉన్నందుకు త్యాగం చెయ్యాలి. అటువంటిది దైవారాధనలో త్యాగం చేస్తే, ఆనందాన్ని పొందవచ్చు. కాని దానిని ఖర్చుపెడితే మన జీవితం కూడ అలాగే ఖర్చైపోతుంది.

ప్రొద్దున్నే బాలభోగం పెట్టారు. ఎందుకు? సత్సంగం కోసం. అన్న ప్రసాదమే ఎందుకు అంటే, అన్న ప్రసాదం అయితే నిండుగా వస్తుంది. గారెలవంటివి అయితే లెక్క ప్రకారం వస్తాయి. నేను తింటే నీవూ తింటావు. నేను పస్తున్నా, నిన్ను పస్తు పెట్టను అన్నారు గురుదేవులు. మమ్మల్ని Paper Babies లాగా ఉండాలన్నారు. జీవితంలో సుఖం ఉండటం కాదు. మనస్సులో సుఖం ఉండాలి. అప్పుడు చెత్తకింద ఉన్నా ఆనందంగానే ఉంటుంది. గురుదేవునికి సమర్పించ వలసినవి కాకుండా, ఇతరమైన భావాలు వస్తే, అక్కడ స్వైర విహారం ఉంటుంది. ఇతర చింతలు ఎక్కడ ఉండే అక్కడ రోగం వస్తుంది. నీకు రోగం వస్తే ఇక యోగం ఎక్కడ?

చిన్నప్పటినుండి ఎంత నామం చేశామో ఒక్కసారి అవలోకనం చేసుకోండి. మనంత భాగ్యవంతులు లేరు. అదే, ధనం పెట్టుకొని ఒంటరిగా ప్రయాణం చెయ్యాలంటే భయమే. ఎవరైనా వచ్చినా భయమే. నగలు పెట్టుకొని రాత్రి రోడ్డుమీద వెళ్ళలేవే. ఇవేవీ సుఖం ఇవ్వలేవు. సుఖం ఇచ్చేది భగవన్నామం.

ఎవరు దానిని గుర్తిస్తారో ఎంత ఉపయోగించుకుంటారో, దాని వలన అది అంత పెరుగుతుంది. మహాత్ములు మనకు నామ ధనం ఎంత ప్రసాదించారు! లక్ష్యశుద్ధి, ఏకాగ్రత కుదిరి భగవన్నామం చేసుకోగలిగితే చాలు!

విత్తముచే నీకు ఒకనాడైనా చిత్తశాంతి దొరకదురా! నామస్మరణ చాలు. మాతా, పితా, సుతా... అంతా ఝూటా. ఈ ప్రపంచం అంతా ఝూటా. ఇదంతా భ్రాంతి అనుకుంటూనే, చేసేది అంతా ప్రపంచానికి సంబంధించి ఉంటే ఎవరేమి చేయగలరు? చెప్పేది ఒకటి చేసేది ఒకటీ అయితే, ఆ మనస్సుకు ఎప్పుడో ఒకప్పుడు యాక్సిడెంట్(accident) అవుతుంది. చేసినదంతా వృథా అవుతుంది. అందుచేత వీతరాగివై, రాగద్వేషములను విడిచిపెట్టి, శ్రీహరినామం స్మరించి తరించు. చేసి తరించని వాళ్ళు లేరు. నమ్మి తరించని వాడు లేడు. మహాత్ములు ఆ నామధనాన్ని వెదజల్లారు. మనం పట్టుకోకపోతే ఇంకా ఒలకపోశారు. ఏళ్ళు మీద పడుతున్నై. ఎంత వరకు సాధన జరిగింది అంటే, అది కుంటుపడుతున్నది. నేను చేస్తున్నాను అనే అహంకారాన్ని మనం రహితం చేసుకోవాలి. భగవంతుడు చేయిస్తున్నాడు అన్న నిండైన భావన ఉంటే మనకు బాగుంటుంది. ఈ సంపెంగ పువ్వు నేనే తెచ్చాను అంటారు. అవి సరిగా దాచక నల్లగా అయితే, అప్పుడు కూడ నేనే తెచ్చాను అంటారా? అయ్యయ్యో! ఎలా దాచాలో తెలియలేదు అంటారు.

మన జీవితం భగవంతుడి చేతిలో ఉన్నది అని గ్రహిస్తే ప్రతి కదలిక భగవంతుడిదే అయి ఆయనే మన కూడ ఉండి మనను కడవరకు నడిపిస్తాడు. భగవంతుడు మనను ఎలా నడిపించేది గురుదేవులు మనకు అందించారు. అవి మార్జాల కిశోర న్యాయము, మర్కటకిశోరన్యాయము. మర్కటకిశోర న్యాయంలో పిల్లకోతి తల్లిని పట్టుకుంటుంది. తల్లికోతి ఈ కొమ్మమీద నుండి ఆ కొమ్మమీదకు, ఆ చెట్టుమీదనుండి ఈ చెట్టుమీదకు ఎగిరి దూకుతుంటే, పిల్లకోతి తల్లిని గట్టిగా పట్టుకొని ఉంటుంది. తల్లికి పిల్లబాధ్యత ఏమాత్రమూ ఉండదు. కాని మార్జాలకిశోర న్యాయంలో బాధ్యత అంతా తల్లిపిల్లిమీద ఉంటుంది. అది తన పండ్లతోనే జాగ్రత్తగా పట్టుకొని, అన్ని పిల్లలనూ ఏడు చోట్లకు తిప్పుతుంది. అయినా అది ఆ పిల్లలకు గాయం కాకుండా పట్టుకుంటుంది. పిల్లిపిల్లలకు ఏం అవసరం వచ్చినా అవి 'మ్యావ్' అంటే చాలు, కావలసినవన్నీ తల్లిపిల్లే చూసుకుంటుంది. మన గురుదేవులు మనను ఏడుకాదు, ఎన్నో చోట్ల తిప్పవచ్చు కాని బాధ ఉంటుందా? -సశేషం

# మాతాజీ సత్సంగ్ డైరీ

-రమణ ప్రసాద్

గురుభక్తులైనవారు ఎక్కడెక్కడ ఉన్నప్పటికి, ఈ పూర్ణిమ తలపుకు రాగానే ఎవరి శరీరమంతా రోమాంచిత మౌతుందో, హృదయమంతా ఆనంద పూరితమౌతుందో, వారే నిజమైన గురు భక్తులని శ్రీ గురుదేవులు చెప్తుండేవారు. అందులోనూ వైశాఖ మాసం వైరాగ్యాన్ని తెచ్చిపెట్టేది. వైశాఖ మాసంలో బయట ప్రపంచంలో ఉంటే తెలుస్తుంది. కరెంటు పోయి, ఎండ వేడికి, బాగా వేడెక్కుతుంటే గాలి ఆడక, ఉస్సు రస్సు అనుకుంటూ, అబ్బబ్బ, ఇంకా కరెంటు రాలేదు, అనుకుంటూ, ఫాన్లవంక చూస్తూ ఉంటే వైరాగ్యం గట్టిగా వస్తుందప్పుడు. మా గురు సోదరి చెప్పింది, శ్రీ గురుదేవులు ప్రపంచమంతా తీసికొచ్చి, ఒక సీసాలో పెట్టి బిరడా మూసేశారట. అందులో, ఈ చిన్న ప్రపంచంలోని, మరొక చిన్న ప్రపంచంలో, ఏమాడుకుంటున్నై? ఎవరి మనస్సులు వాళ్ళకే ఎదురు తిరుగుతున్నై. ఇక్కడ సాధన చేసుకొనే వారిలో, మనోవైకల్యం ఎవరికి ఉంటుందో, ఎవరి మనస్సులో తేలికతనం ఉంటుందో, సాధనలో ఉన్నఅటువంటివారి మనస్సు ఒక్కసారి తననుతాను గుర్తించి నీవు చేస్తున్నదేమిటి? అని నిలదీస్తే, నిజంగా సాధన అప్పుడే మొదలైనట్లు. సరే శ్రీకృష్ణభగవానులు, జగద్గురు దేవులు చెప్పనే చెప్పారు.

**"ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మాన మవసాదయేత్**
**ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః"** అని.

ఎవరికి ఎవరు శత్రువు ఇప్పుడిక్కడ? ఎవరైనా మాట్లాడుకుంటున్నప్పుడు నీవు దూరంగా ఉండి వినటం తటస్థిస్తే, అది నాగురించేనేమో, అని నీవు వింటే, లేదా అనుకుంటే, అప్పుడు నీ మనస్సులో యుద్ధం బయలుదేరుతున్నది. నీవు ఇంకొకళ్ళ వంక చూస్తే, వాళ్ళేదో నీ వంక చూసినా చూడక పోయినా, చూసినట్లు కనిపిస్తుంది, ఎలాఅంటే కెమెరా ఎదురుగుండా పెట్టే సరికి, అందరం సర్దుకొని కూర్చుంటాము, మన ఫోటో తీస్తున్నారని. వాస్తవానికి, ఆ ఫోటోలో మనం ఉండము. చాలా బాగా సర్దుకుంటాము, ఆ పక్కన మనం కూడా పడతామని. దూరంగా ఉన్న కెమేరా మనవైపు కూడ చూస్తున్నట్లే ఉంటుంది. కానివాళ్ళు చేసే జూమ్‌లో ఉంటుంది దగ్గర, దూరం. దూరంగా పెడితే మనందరం వస్తాము. దగ్గరిగా జూమ్ చేస్తే, ఏ వ్యక్తి కావాలంటే ఆ వ్యక్తే.

తుపాకిని సరిగా గుఱిపెట్టినప్పుడు ఎవరు కావాలంటే వాళ్ళకే తుపాకి గుండు ఎలా తగుల్తుందో అలా, ఇన్ని ఉపాయాలన్నీ మనకు తెలుసు ఏం? ఇన్ని ఉపాయాలూ తెలిసీ, ప్రపంచంలో బ్రతకటం నేర్చుకొనీ, ఈ వింత ప్రపంచంలో మన జీవితానికి ఏం కావాలో మనం ఎంత వరకు గుర్తిస్తున్నాము? మనకుగాను మనం ఏం చక్కబెట్టుకుంటున్నాము, మన జీవితానికి? సరే గురువు ఉన్నారు లెండి. వెఱ్ఱిబాగులవాళ్ళు వాళ్ళు నిజంగా. లేకపోతే ఇలా వినకుండా కరుడుగట్టుకొని పోయిన బుఱ్ఱలను దగ్గర పెట్టుకోవటం ఏమిటి? నువ్వు నవనీతమైతేనే నాకిష్టము అని, మనస్సు నవనీతమైపోవాలి అనుకుంటే, మనమేం చేస్తున్నాము. నవనీతంలాగ పైకి కనిపిస్తే కనిపించవచ్చుగాని, నవనీతం మాత్రం కాలేదు. తెల్లగా బొమ్మలెన్ని రావటంలా? నవనీతంలాగా? రాయిమీద కూడ తెల్లటి రంగువేస్తే నవనీతంలాంటి తెలుపు అంటాము. 'నవనీతంలాంటి' అంతేగాని, 'నవనీతం' మాత్రం కాదు. మాధవుణ్ణి గుర్తించే మహదవకాశాన్ని ప్రసాదించే మానవ జన్మకు వచ్చి కూడ, చాలా దగ్గరగా, మనలోనే ఉన్న మాధవత్వాన్ని గుర్తించకుండానే, మనమేం చేస్తున్నాము? మానవుని వలె కనిపిస్తున్నాము కాని మనస్సులు మాత్రం రాక్షసత్వాన్ని కలిగి ఉంటున్నై. అసురత్వాన్ని కలిగి ఉంటున్నై. అదేమిటండీ? అలా ఎందుకుంటై? మేమేమన్నా హిరణ్య కశిపులమా? మేమేమైనా రావణాసురులమా? మీకసలెలా కనిపిస్తున్నాము? అంటారేమో. పోనీ మగవాళ్ళు సరే. మేమేమన్నా పూతనలమా? రాముడికాలంలో ఉన్న తాటకిలమా అని స్త్రీమాతలు అడగవచ్చు. ఒక్కసారి ఆలోచించండి, మన మనస్సులు వాళ్ళకు ఎంత దగ్గరగా ఉన్నై?

అయితేనేమి? సొంతం అటుపక్క ఉన్నా, ఆ రాముడు వచ్చి బాణం వదుల్తాడు. అటూ ఉండటంలా. ఇక్కడదాక వచ్చిన తర్వాత, ఇక్కడేం చేస్తున్నాము? ద్వంద్వ భావన కలిగి ఉంటున్నాము. తనువొకచోట, మనసొకచోట. "తప్పుతుందాండీ? వచ్చినప్పుడు చూడ వద్దా అండీ?"అనకండి. ఇంటి దగ్గర మిఠాయిలు అవీ చాలటం లేదా? ఇక్కడ కూడ గురుదేవులు ఏమీ తక్కువ చేయటంలా మిఠాయిలకు, ప్రసాదాలకూ. మేమేమో, ఏదో గురుపూర్ణిమ కదా! పాపం అందరూ మందులేసుకొనే వాళ్ళు, పెద్దవాళ్ళైపోయారు, మీరు సరిగ్గా ఆలోచించండి, ఆశ్రమం అంతా ఇప్పుడు వృద్ధాశ్రమంలాగా ఉన్నది. అందరూ వృద్ధులే. వృద్ధులనుకుంటున్నారా? తప్పు, పొరపాటు (ఇంతలో వెనకనుండి ఒకరు గురోర్భ్యవా అని అందించారు).

-సశేషం

# శ్రీ బాబూజీ దివ్యవాణి

సమర్థ రామదాసస్వామి అనుగ్రహముతో పాటు, భక్త తుకారాముని ఆశీస్సులను పొందడం కూడా శివాజీ మహారాజు చేసుకున్న పుణ్య విశేషం. ఈ ఇరువురు మహాత్ముల సన్నిధి సాంగత్యములే అతనిని జనకుని వంటి రాజయోగిగా తీర్చిదిద్దినాయి. అతని పరిపాలన రామరాజ్యమును తలపింప చేసినది.

భక్త కబీరుదాసు, భక్త రామదాసుల దివ్య ప్రభావం ప్రసరించిన గోల్కొండ సుల్తాను తానీషా భాగ్యవిశేష మేమని చెప్పవలె? భక్తుడైన రామదాసునకు దర్శనమిచ్చుటకంటె ముందుగనే శ్రీరామచంద్రుడు తన తమ్ముడు లక్ష్మణునితో సహా తానీషాకు దర్శనమిచ్చినాడు. ఈ సంగతి తానీషా తెలుసుకో గలిగిన అనంతరం తాను కూడా శ్రీరామునకు పరమ భక్తుడై విలసిల్లినాడు. పూర్వజన్మలో యోగభ్రష్టుడై ఉంటేతప్ప, ఇట్టి సదవకాశం లభించడం దుర్లభం.

ఇటీవల ఇరువదవ శతాబ్ది ఆరంభంలో హిందూజాతి ఆధ్యాత్మిక, సామాజిక పునరుజ్జీవనానికి కారకులైన మహనీయులు శ్రీ రాకృష్ణ పరమహంస. వేదోపనిషత్తుల దివ్య సందేశం వివేకానందుని మూలంగా ప్రపంచం నలుమూలలకు వ్యాపించింది. భారతీయులుకూడా నిదురమత్తు నుండి మేల్కొన్నారు. రామతీర్థస్వామి, గాంధీ మహాత్ముడు, రమణమహర్షి మున్నగు వారిద్వారా తర్వాత ఈ మహోద్యమం మరింతగా ముందుకు కొనసాగింది. హిందూ ధర్మపు విలువను కాపాడుతూ, భారత దేశపు పూర్వపు ఔన్నత్యాన్ని తలపింపచేసే మార్పులు దేశంలో గొనితెచ్చుటకు శాయశక్తులా కృషిచేస్తున్న మహాత్ములు ఈనాటికినీ లేకపోలేదు.

ఇదంతా ఈ కలియుగంలో ఆధునిక కాలమున మనదేశంలో జన్మించిన మహాత్ముల గురించిన ప్రస్తావన. పూర్వ యుగాలలోనికి, అనగా, కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగాల గాథలలోకి పోతే ఇంతకంటే దేదీప్యమానమైన ఉదాహరణలు మనకు కనిపిస్తాయి. మచ్చుకు వాటిలో కొన్నిటిని పరిశీలిద్దాము.

ఒక డేగకు ఆహారం కావలసి యుండిన పావురమును రక్షించు నిమిత్తమై శిబిచక్రవర్తి రక్తమాంస సమేతంగా తన శరీరమునే అర్పింప చూచిన

గాథ సుప్రసిద్ధమే. తన ప్రాణమునైనా బలియిచ్చి ఇతర ప్రాణిని రక్షించడంలోని మహదానందమును ఆ మహనీయుడు అనుభవించ గలిగాడు. అట్లు బలి యిచ్చుకోవడానికి సిద్ధం గానియెడల మరికొన్ని సంవత్సరాలపాటు అతడు జీవించవచ్చుననే మాట నిజమే. కాని, అలా జీవించగలిగే కాలం శుభప్రదంగా ఉంటుందనే నమ్మకమేమిటి? ఇప్పుడే బలి సమర్పణం మూలముగా అతనికి అఖండమైన ఆత్మసంతృప్తి కలుగుతున్నది. దీనివలన అతడు ఒక విధమైన అతి మానుష స్థాయినందుకొని దాదాపు దైవత్వానికి సన్నిహితుడు కాగలుగుతున్నాడు.

దధీచి మహాముని తన వెన్నెముకను అసుర సంహారమునకై వజ్రాయుధంగా దేవేంద్రునకు ఉపయోగపడే నిమిత్తం సమర్పించివైచిన గాథ కూడా ఇలాంటిదే. సత్యంకోసం ఆత్మబలి సమర్పించిన వారు అసురులలో సైతం లేకపోలేదు. ఉదాహరణకు బలిచక్రవర్తి. తనను అణగద్రొక్కడానికై సాక్షాత్తుగా విష్ణుమూర్తియే వామన రూపంలో వచ్చినాడని తెలిసికూడా కేవలం తన వాగ్దానమును నిలబెట్టుకొనడం కోసం అతడు తన మహాసామ్రాజ్యముతో పాటు తనను కూడా బలియిచ్చుకున్నాడు. బలి నామధేయం అమోఘ బలిమికే కాక, అఖండ త్యాగానికి కూడా సంకేతమై విలసిల్లినది ఇందువల్లనేనని ఉద్బోధించారు శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద బాబుజీ మహరాజ్. *





పెదనింద్రకొలను పాఠశాలలో విద్యార్థులకు ఆశ్రమ ట్రస్ట్ వారు నోట్‌బుక్స్ వితరణ చేస్తున్న దృశ్యం

# సమర్ధ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - స్వామి విజయేశ్వరానంద ప్రసాద్

ఒకసారి ఆమె "మా సత్యవతమ్మ కడుపున ఒక్క మగ నలుసును పడెయ్యండి బాబూ! నాకు అంతకంటే వేరే యే కోరికలూ లేవు" అని అన్నారు. వెంటనే శ్రీబాబు నవ్వుతూ, "అదేమిటి నానమ్మా! అలా అంటారు? నేను మా చిన్నమ్మ కొడుకును కానా? అయితే నేను మీ కంటికి నలుసులాగా కూడా కనబడటం లేదా?'' అని, "నానమ్మా! మా చిన్నమ్మకు పూర్వకర్మానుభవం కొంత బలవత్తరమైనది మిగిలి ఉన్నది. అందువలన ఆమెకు సంతానం కలుగదు. కలిగినా నిలవదు. అందువలన ఆమె చెల్లెలిగారి పాపను పెంచుకుంటే బాగుంటుంది''అని సూచించారు.



సత్యవతమ్మగారు అలాగే చేశారు. ఆమె శ్రీబాబుతో ఎంత చనువుగా, సన్నిహితంగా ఉన్నా, ఎంతో భయ భక్తులతో, వినయ విధేయతలతో మెలిగేవారు.

శ్రీబాబు ఒకసారి ఉప్పాడ నుండి గ్రామాంతరం వెడుతూ, తమ కాలి అందెను ఉప్పాడలో మరచి వెళ్ళారు. పిఠాపురం దాకా వెళ్ళేసరికి, తమ కాలి అందెమాట గుర్తుకు వచ్చింది. వెంటనే వారు ఉప్పాడకు తిరిగి వచ్చి,"ఈఅందె నా వద్ద కాకుండా విడిగా ఎవరి యింటిలోనూ ఉండకూడదు. మరచిపోయాను" అని చెప్పి, అది తీసుకొని తిరిగి వెళ్ళారు. ఆ అందె గుల్లగా ఉండేది. అందులో ఏదో మహిమాన్వితమైన విశేషం ఉండవచ్చునని, అందుకే శ్రీబాబు అలా అన్నారని, శ్రీసత్యవతమ్మగారు అనుకున్నారు.

శ్రీబాబు ముక్కుకు ఒక కాడ ఉండేది. దానిని ఆయన ఎంతో జాగ్రత్తగా చూసుకొనేవారు. అది తీయటానికిగాని, మార్చటానికిగాని ఒప్పుకొనేవారు కాదు. "నా మాతృమూర్తి ఎంతో ప్రేమతో నాకీ కాడను అలంకరించింది. అందువలన ఇది నాకు అమూల్యమైనది'' అనేవారు. చాలా కాలం తరువాత కూడా, దానంతట అది అరిగిపోయి, ఊడిపోయే వరకు అలాగే ఉంచుకున్నారు.

శ్రీబాబు పరమానుగ్రహంతో, సహజంగానే భక్తురాలైన సత్యవతమ్మగారు జగన్మాత దర్శనం కూడా పొందగలిగారు. ఒకసారి సత్యవతమ్మగారు రాజమండ్రిలో జరిగే వసంత జయంత్యుత్సవాలకు వెళ్ళారు. అక్కడ జరిగిన ఒక దురదృష్టకర సంఘటనతో తీవ్రంగా మనస్తాపం చెందిన సత్యవతమ్మగారు, ప్రాణ త్యాగం చేయాలని సంకల్పించి, అర్ధరాత్రివేళ గోదావరి నది వద్దకు వెళ్ళారు. అక్కడ ఒక కోయ వనిత ఆమెను ఆ ప్రయత్నం నుండి విరమింపజేసింది. మరొక కోయ వనిత ఆమెను సురక్షితంగా యింటికి చేర్చింది. తరువాత యీ విషయం శ్రీ బాబు వద్ద ప్రస్తావనకు వచ్చినప్పుడు, శ్రీ బాబు "క్షణికోద్రేకాలతో తెలివి తక్కువగా ప్రవర్తించిన మాత్రాన తన భక్తులను జగన్మాత రక్షించుకోకుండా ఎలా ఉండగలదు? కోయవాళ్ళ రూపాలతో వెళ్ళి ఆమెను తిరిగి యింటికి చేర్చవలసి వచ్చింది. తప్పుతుందా?'' అన్నారు.

సత్యవతమ్మగారింట్లో ముద్దులొలికే ఒక బాల కృష్ణుని విగ్రహం ఉండేది. ఆమె ఆ విగ్రహాన్ని ఎంతో ప్రేమగా చూసుకొనే వారు. ప్రతిరోజూ శ్రీబాబు తమ పూజ అయిన తరువాత, ఆ కృష్ణ విగ్రహం వద్ద కూడా కొన్ని పళ్ళు పెట్టి "చిన్నమ్మా! కృష్ణయ్యకు కూడా నైవేద్యం పెట్టకపోతే, మనని తిననిస్తాడా? అల్లరి చెయ్యడూ!'' అనేవారు. "నిజమే బాబూ! ఇద్దరు కృష్ణుల అల్లరి నేను భరించలేను'' అని ఆమె నవ్వేవారు.

ఉప్పాడలో ఉన్నన్నాళ్ళూ శ్రీ బాబు సత్యవతమ్మగారి చేతి భోజనమే తీసుకునే వారు. అంతే కాదు, శ్రీ బాబు ముంజవరపుకొట్టు వెళ్ళినా, అక్కడ సత్యవతమ్మ గారు ఉంటే, ఆమే స్వయంగా శ్రీబాబుకు భోజనం తయారు చేసి తీసుకుని వచ్చేవారు. ఒకసారి బాగా మరుగుతున్న నీళ్ళు పడి, సత్యవతమ్మగారి పాదాలు బాగా కాలి పుండ్లు పడ్డాయి. ఈ సంగతి శ్రీబాబుకు ఎవరో చెప్పి, శ్రీబాబుకు నివేదన ఏర్పాటు వేరే ఎవరితోనైనా చేయిస్తామన్నారు. "ఏమీ ఫర్వాలేదు. ఆమెనే భోజనం తయారు చేసి తీసుకుని రమ్మనండి'' అని శ్రీబాబు ఆదేశించారు. ఆమె అలాగే చేశారు. శ్రీ బాబు ఎవర్నికైనా ఒక సేవను అనుగ్రహిస్తే, అది ఎంత చిన్న సేవ అయినా పెద్ద సేవ అయినా ఆ సేవ నుండి, అనివార్యమైతే తప్ప, వారిని తప్పించటానికి యిష్టపడేవారు కాదు.

ముంజవరపుకొట్టు సత్యవతమ్మగారు పుట్టిన ఊరు. ఆమె అప్పన వారి ఇంటి ఆడబడుచు. ఆమె ముఖ్య బంధు వర్గమందరూ అక్కడ ఉన్నారు. వారందరికి శ్రీబాబు దర్శన భాగ్యం కలిగించాలని, సత్యవతమ్మగారు

శ్రీబాబును ముంజవరపుకొట్టు వెళ్ళమని ప్రార్థించారు. మొదట్లో శ్రీబాబు అసలు పట్టించుకోలేదు. కానీ ఆమె ఆ విషయమై పదే పదే శ్రీబాబుతో ప్రస్తావించేసరికి, శ్రీబాబు కొంచెం తీవ్రంగా "నేను ఎక్కడికీ వెళ్ళకుండా మీ వద్దనే ఉండిపోవాలనుకుంటున్నాను. నాకు ముంజవరపుకొట్టు వెళ్ళాలని లేదు. అయినా మీరు బలవంతం చేసి నన్ను అక్కడికి పంపిస్తే , యిక నేను మళ్ళీ మీ ఇంటికి రాను'' అన్నారు. అలా అన్నా కూడా, అదేమి విధి ప్రేరణమో గాని, సత్యవతమ్మగారు, శ్రీబాబు అంతపని చేయరులెమ్మని అనుకొని, మొత్తం మీద శ్రీబాబును ముంజవరపుకొట్టుకు తీసుకుని వెళ్ళారు. ఆ తరువాత శ్రీబాబు సత్యవతమ్మగారింటికి ఎన్నడూ వెళ్ళలేదు.

సత్యవతమ్మగారి కుటుంబము, మరి కొందరు సన్నిహితులు కలిసి, అప్పుడప్పుడు భద్రాచలము, శ్రీశైలము, హరిద్వార్, హృషీకేశ్ వంటి క్షేత్రాలకు యాత్రలకు వెళ్ళేవారు. "బాబూ! మాతో మీరు కూడా రండి'' అని సత్యవతమ్మ గారు ప్రాధేయ పడేవారు. "నాకు పని ఉంది. మీరు వెళ్ళి రండి అని'' శ్రీబాబు తమ పని మీద వెళ్ళిపోయే వారు. తీరా వాళ్ళంతా అక్కడకు చేరుకుని, కృష్ణకో, గంగకో, గోదావరికో స్నానానికి వెళ్ళేసరికి అక్కడ ప్రత్యక్షమయ్యే వారు. వెంట త్రిప్పుకొని అక్కడి విశేషాలన్నీ చూపించేవారు. రాజమండ్రి నుంచి పడవ మీద భద్రాచలం వెడుతున్నపుడు పాపికొండలు చూపించి, "ఇక్కడ నేను కొంతకాలం తపస్సు చేసుకున్నాను'' అన్నారు. అలాగే హృషీకేశ్‌లో లక్ష్మణ్ ఝూలా, రామ్‌ఝూలా ప్రాంతాలలో తాము తపస్సు చేసుకున్నట్లుగా చెప్పారు.

శ్రీబాబు ఉప్పాడకు చాలా ఎక్కువగా వచ్చేవారు. ఎక్కువ రోజులుండేవారు. ఒకసారి తుని నుండి మామిడి వెంకట రమణగారు వచ్చి, వారి యింట్లో ఏదో గ్రహ బాధ నివారణార్థం శ్రీబాబును తుని తీసుకుని వెళ్ళారు. శ్రీబాబు తుని భక్తులకు పరిచయం కావటం అప్పుడే మొదలు.

ఉప్పాడ నుంచి శ్రీబాబును ముంజవరపుకొట్టుకు తీసుకుని వెళ్ళిన తరువాత సత్యవతమ్మగారికి శ్రీబాబు దర్శనం దుర్లభమే అయిపోయింది. రాజమండ్రి జయంతులకు ఆమె వచ్చారు కాని, ఎవరివల్లనో అవమానం పొందటం దేహత్యాగానికి ప్రయత్నించటం, జగన్మాత రక్షణతో ఆ ప్రయత్నం విరమించు కోవటం జరిగిన తరువాత ఇక అక్కడి భక్తులకు తన ముఖం చూపించటం ఇష్టం లేక, ఆ జయంతులకు కూడా వెళ్ళటం మానుకున్నారు.

-సశేషం

# నీవు వినలేని పిలుపే లేదు

శ్రీమాతాజీ ఐ.సి.యు.లో అడుగుపెడుతూనే చంపక కుమార్తె శ్రీమతి ఫణి ఆనందంతో "అమ్మా! మాతాజీ వచ్చారే. కళ్ళు తెరిచి చూడు" అన్నారు. చంపక వద్దనుండి ఏ విధమైన రెస్పాన్స్ (response) లేదు. లండన్ నుంచి వచ్చిన 'శ్రీరామకృష్ణ ప్రసాద్, డాక్టర్లు చెప్పినట్లు అమ్మ మరణించే ఉంటుంది. అమ్మ అంత్యక్రియలు కూడ అయిపోతాయేమో అని భయపడుతూ వచ్చాను. కనీసం అమ్మ మాట్లాకపోయినా, ప్రాణాలతో అమ్మను చూడగలిగాను. గురుదేవుల అనుగ్రహం వలననే నాకీ అదృష్టమైనా కలిగింది, అంతవరకే తృప్తి' అనుకున్నాడు.

అమ్మ చంపకను పలకరించారు. ఓంబాబు, శ్రీబాబు మన హృదయబాబు అని సంకీర్తన చేస్తూ, చంపకను చూపిస్తూ వీళ్ళంతా నన్ను నా చిన్నప్పుడు ఎత్తుకొని తిప్పినవారే అని మిగిలిన వారికి చెప్తూ 'ఏమే! ఇప్పుడు నన్ను ఎత్తుకుంటావా?' అని ఛలోక్తి విసిరారు. కేవలం ప్రాణావశిష్టమై బల్లిలా మంచానికి అతుక్కొనిపోయి చలనం లేకుండా పడి ఉన్న చంపకను చూసి. అందరూ మాతాజీ ఛలోక్తికి, ఉల్లాసంగా నవ్వుకున్నారు. ఆ సమయంలో అక్కడ ఎవ్వరికీ మృత్యుఛాయలు కనపడలేదు. అమ్మతో ఐ.సి.యు.లోకి వచ్చిన వారందరూ గురునామస్మరణ చేస్తున్నారు. ఇక ఆలస్యం చేయకుండా అమ్మ తమతో తెచ్చిన తీర్థం కొన్ని చుక్కలు చంపక నోట్లో వేశారు. అందరికీ ఆశ్చర్యంగొలిపేలా కోమాలో ఉన్న చంపక కొద్దిగా కళ్ళు తెరిచి మాతాజీవైపు చూసి, నాలుకజాపి ఆ తీర్థాన్ని చప్పరించి గుటకవేసి మళ్ళీ వెంటనే కళ్ళు మూసుకున్నారు. అమ్మ తన వెంట తెచ్చిన చీర, రవికగుడ్డ, పసుపు కుంకుమలు చంపక చేతిలో ఉంచి, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని, కొన్ని క్షణాలు అలా మౌనంగా ఉండిపోయారు. తమ మౌనవ్యాఖ్య ద్వారా అమ్మ చంపకకు ఏమి ప్రసాదించారో, వారిద్దరికే తెలియాలి. శ్రీరామకృష్ణకు ఎంతో ఆనందం కలిగింది. అమ్మ తనతో మాట్లాడకపోతే ఏమి, ఆ మాటకు వస్తే, తను వచ్చిన తరువాత, అమ్మ అసలు ఎవ్వరితోనూ మాట్లాడగలస్థితిలో లేదు. అంత్యక్రియలకైనా అందుకోగలనో లేనో అనుకున్న తాను, అమ్మను ఆఖరిసారిగా ప్రాణాలతో చూశాడు. దానిని తలచుకొన్నకొద్దీ, దానిని సుసాధ్యం చేసిన గురుకృపను తలచుకొన్నకొద్దీ అతడి హృదయం ఆర్ద్రమౌతున్నది.

కొద్ది క్షణాలు అలా మౌనంగా ఉన్న తరువాత, అమ్మ తాము చేయవలసినది పూర్తి అయింది అన్నట్లు చంపక చేతిని విడిచి లేచి నిలుచుని డాక్టర్‌ను పిలవండి అన్నారు. చంపక ముఖంలో ఎక్కడా మృత్యుఛాయలు లేవు. ఏదో దివ్య దర్శనాన్ని పొందినట్లు ఆమె ముఖం ప్రశాంతంగా ఉన్నది. చంపక ఆత్మ పరమాత్మలో లీనమైంది. అక్కడ ఉన్నవారి అందరి హృదయాలకు ఏం జరిగిందో అర్థం అయింది. అవి తమ మౌనభాషలో శ్రీమాతాజీవారు చంపకను తమలో లీనం చేసుకున్నారు అని గ్రహించాయి.

డా॥ గంగాధర్‌గారు వచ్చారు. వారు శ్రీమాతాజీకి నమస్కరించి 'అమ్మా! పరిస్థితులు పూర్తిగా విషమించి, అంతా మాచేయిదాటిపోయిన తర్వాత ఈ కేసు మాదగ్గరకు వచ్చింది. మూడు రోజుల క్రితమే, అన్ని పరీక్షలు చేసి, ఇది హోప్‌లెస్ (hopeless) కేసు అని, పేషెంట్ ఇంక మూడు గంటల కంటె బ్రతకదని, అందరకు కబురు చేసికోమని ఆరోజే చెప్పాము. అసలు ఆమె ఇంతవరకు కోమాలో ప్రాణాలతో ఉండటం డాక్టర్‌నైన నాకే ఆశ్చర్యకరంగా, అర్థంకాకుండా ఉన్నది' అన్నారు. వైద్య శాస్త్రానికి సవాళ్ళుగా నిలిచి పోయిన శ్రీబాబూజీ లీలను కొన్ని ఎందరో భక్తులు ప్రత్యక్షంగా చూసి ఉన్నారు.

శ్రీమతి ఫణి శ్రీమాతాజీతో "అమ్మా! డాక్టర్‌గారు మూడురోజుల క్రితమే అమ్మ మూడు గంటల కంటె ఎక్కువ బ్రతికే అవకాశంలేదు అన్నారు. అమ్మేమో ఎప్పుడూ 'బాబు', 'బాబు', నేను బాబు దగ్గరకు వెళ్ళాలి అనేది. మేమంతా ఏం జరుగుతుందా అని ఆదుర్దాపడుతున్నాము. శ్రీబాబే స్వయంగా ఇప్పుడు మీ రూపంలో వచ్చి, అమ్మకు తీర్థం ఇచ్చి, అమ్మను ఉద్ధరించారు. మాకు ఇది చాలు. ఇప్పుడు మాకెంతో తృప్తిగా ఉంది అన్నది. శ్రీమాతాజీ ఔనే! మరి మాది ఇక్ష్వాకు వంశం, ఈ నోటివెంట పొల్లుమాటరాదు అని సభాముఖంగా ఎన్నోసార్లు చెప్పిన సత్య గురుదేవులు వారిచ్చిన వాగ్దానాన్ని ఎలా మరచిపోతారు? ఆమె పిలుపును విన్న గురుదేవులు ఊరుకుంటారా?" అన్నారు.

ఔను మరి, కనురెప్పపడటంలో అయినా ఆలస్యం ఉంటుందేమోకాని గురుదేవుల రక్షణలో ఆలస్యం ఉండదు అని గురుదేవులు ఎప్పుడూ చెప్పేవారు. గురుదేవుల రక్షణ తప్పక జరుగుతుంది అనేది భక్తులందరి విశ్వాసము. అయితే అది ఎప్పుడు అందించాలో, ఆ నిర్ణయకాలం గురుదేవులకే తెలుసు.

-సశేషం

# ప్రయాణకాలే Z పి చ మాం విదుర్యుక్త చేతసః

- సూర్య నారాయణ గుప్త

"........వారు ఇంకొక అరగంట కంటె ఎక్కువ జీవించరు. ముఖ్యమైన బంధువులందరికి కబురు చేసుకోండి అని హాస్పిటల్‌లో ఉన్న డాక్టర్లు చెప్పారు........"

ఫోన్‌లో చెప్పటం వినిపిస్తున్నది. అయినా నా ఆలోచనలలో నేనే. శ్రీమాతాజీ వారికి తమ దర్శన భాగ్యాన్ని ప్రసాదించి వెళ్ళిన తరువాత, మా మామగారు జీవితంపట్ల చాలా ఉదాసీనంగా ఉంటున్నారు. అమ్మ అలా అభయం ఇచ్చి వెళ్ళిన పదిరోజులకే మా మామగారి వ్యాధి తీవ్రరూపం ధరించి, ఆయన భీమవరం హాస్పిటల్‌లో చేరారు. ఇదిగో ఇప్పుడు ఫోన్‌లో ఈ వార్త.

ఆ సమయంలో నేను చేయగలిగిన, వెంటనే చేయవలసిన కర్తవ్యం ఈ వార్తను శ్రీమాతాజీవారికి తెలియజేయటమే. వెంటనే శ్రీమాతాజీకి ఫోన్ చేశాను. శ్రీగురుదేవులు నా ప్రార్థనను ఆలకించినట్లుగా శ్రీమాతాజీయే స్వయంగా లైన్లో వచ్చారు. వెంటనే అమ్మకు సంగ్రహంగా విషయం మనవి చేశాను. కరుణామూర్తి, అమ్మ 'నేను శ్రీబాబూజీవారిని ప్రార్థిస్తాను. నీవు భీమవరం ఫోన్ చేసి, అక్కడ ఉన్నవారినందరిని, భగవంతుణ్ణి ప్రార్థించమను." అని చెప్పారు.

నేను వెంటనే ఫోన్ చేసి భీమవరంలోని బంధువులందరికీ శ్రీమాతాజీవారి ఆదేశాన్ని తెలియ పరచాను. వారు రైస్ మిల్లర్స్ ఛాంబర్ పూర్వాధ్యక్షులు కనుక, మర్నాడు అంటే 9వ తారీఖు సంతాప సూచకంగా, వ్యాపార సంస్థలను మూసి వేయమని పురమాయించాము. తరువాత స్వామివారికి నమస్కరించుకొని, ప్రార్థన చేసుకున్నాను. భీమవరం బయలుదేరాను. నేను జలగావ్ నుండి విజయవాడ చేరేసరికి ఉదయం 8గం॥30నిలు అవుతుంది. విజయవాడలో దిగగానే వెంటనే భీమవరం వెళ్ళటానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నాను.

సరిగ్గా 6గం॥30నిలకు మళ్ళీ ఫోన్. మా బావమరిది లైన్లో ఉన్నాడు. "బావగారూ! సడన్‌గా నాన్నగారి ఆరోగ్య పరిస్థితి చాల మెరుగైంది. ఆయన ఇప్పుడు అందర్నీ గుర్తు పడుతున్నారు. డాక్టర్లకు కూడ ఇది ఎలా సాధ్యపడిందో అర్థం కావటంలేదు. వాళ్ళంతా ఆశ్చర్యపోతున్నారు" అని చెప్తున్నాడు.

మా మామగారి ఆరోగ్యం అలా మెరుగు పడటానికి వైద్య శాస్త్రంలో ఏ అధారాలూ దొరకక పోవచ్చు, డాక్టర్లకు అర్థం కాకపోవచ్చు. కాని నా హృదయానికి తెలుసు. ఎలా తెలుసు? ప్రత్యక్ష అనుభవ ప్రమాణం వలన తెలుసు. నేను విజయవాడలో ట్రెయిన్ దిగగానే నేరుగా శ్రీ కాళీ గార్డెన్స్ ఆశ్రమానికి వెళ్ళాను గురుదేవుల దర్శనం చేసుకోవటానికి.

ఆశ్రమం చేరగానే శ్రీమాతాజీవారి దగ్గరకు వెళ్ళాను. నాకు ఆశ్చర్యం కొలిపే విధంగా శ్రీమాతాజీ నేను తమ దర్శనానికి వస్తున్న విషయం తమకు ముందే తెలిసినట్లు నేను వస్తూనే నాకు వెంటనే దర్శనం ఇవ్వటానికి అన్నట్లు సిద్ధంగా ఉన్నారు. అమ్మ పాదాలకు నమస్కరించి జరిగినదంతా విన్నవించుకున్నాను. సర్వజ్ఞులైన గురుదేవులకు తెలియదని కాదు కాని మనం తెలియ చేసుకుంటే మన హృదయం క్షాళనం అవుతుంది. అమ్మ అంతా మౌనంగా విన్నారు. నన్ను ఆశీర్వదిస్తూ నా చేతికి తీర్థం ఇచ్చి, నీవు వెంటనే వెళ్ళి దీనిని మీ మామగారికి అందజేయి అన్నారు.

నేను ఆలశ్యం చేయకుండా కాళీగార్డెన్స్ నుండి బయలుదేరి భీమవరంలో నేరుగా మా మామగారు ఉన్న హాస్పిటల్‌కు వెళ్ళాను. వెంటనే వారికి మాతాజీవారు పంపిన తీర్థం ఇచ్చి, మాతాజీవారి ఆశీస్సులను అందజేశాను. ఆయన పరమానంద భరితులైనారు. ఆఖరు చూపులకని అంతకు క్రితంరోజే భీమవరం చేరుకున్న బంధువులందరూ ఇది తెలుసుకొని, ఆశ్చర్యానందాలతో బిలబిలమంటూ హాస్పిటల్‌కు చేరుకున్నారు. మా మామగారు వచ్చిన వారినందరిని పేరుపేరున కుశల ప్రశ్నలు అడిగి, వారికి సంతోషం కలిగించారు.

9వతేదీ సాయంత్రం 6గం॥లకు నేను పురప్రముఖులతో ఛాంబర్ కార్యాలయంలో మీటింగ్‌లో ఉన్నాను. ఉన్నట్లుండి, మా బావమరిది వద్దనుండి ఫోన్. "బావా! ఇక్కడ డాక్టర్లు నాతో, మీ నాన్నగారికి పూర్తి స్వస్థత వచ్చింది, ఇక ICU లో ఉంచనవసరంలేదు. ఆయనను అక్కడ నుండి రూమ్‌కి మార్చమని నన్ను ఒకటే ఒత్తిడి చేస్తున్నారు. మీరు వెంటనే బయల్దేరి ఒకసారి ఇక్కడకు వచ్చి వారికి నచ్చజెబితేకాని వారు మాట వినేట్టులేరు. మీరు వెంటనే రండి" అని.

నేను వెంటనే అక్కడ ఉన్న పెద్దలలో శ్రీగన్నాబత్తుల నాగేశ్వరరావుగారిని, మోపర్రు సుబ్బారాయుడుగారిని వెంటపెట్టుకొని హాస్పిటల్‌కు వెళ్ళాను.

-సశేషం

# అమెరికాలో శ్రీ మాతాజీ

**(ది. 16.06.2010 న్యూజెర్సీ, అమెరికాలో శ్రీ మాతాజీ వారి అనుగ్రహభాషణ సంగ్రహరూపం)** **-శివప్రసాద్**

మానవ జీవితం వచ్చిన తరువాత ఏదో ఒకరకంగా జీవిస్తేచాలు అని సరిపెచ్చుకోవటమేనా లేక ఇంకేమైనా చేయాల్సిందిగాని, గుర్తించాల్సింది గాని ఉందా? మానవుడికి తనకు తెలియని దానిని గురించి తెలుసుకోవాలని ఆవేదన ఉండాలి. లౌకికపరంగా చాలామందికి ఈ తెలివి బాగానే ఉంది. డబ్బు వస్తుంది అంటే, దానికి చేయవలసినదంతా (అసక్తి) interest లేకపోయినా సరే చేసి ఆ డబ్బు సంపాదిస్తున్నారు. ఇప్పుడు డబ్బు సంపాదించటానికి బోలెడు మార్గాలు. దానికితగ్గట్టు బోలెడన్ని conveniences కూడా వచ్చాయి. కానీ ఇవన్నీ ఉన్నా అనుభవించటానికి ఈ దేహంలో ప్రాణం ఉండాలి. శరీరం ఆరోగ్యం కలిగి ఉండాలి.

ఐహికమైన సుఖాన్ని ఇవ్వలేవు. శ్రీ గురుదేవులు చెప్పినట్లు వేలకు వేలు పోసి, టిక్కెట్టు కొని flight ఎక్కిన తర్వాత బాగా కడుపునొప్పో, తలనొప్పో వస్తే ఆ flight సుఖాన్ని ఇవ్వగలుగుతుందా? శ్రీ గురుదేవులు అంతవరకే చెప్పారు. ఈ మధ్యే రెండు flights పడిపోయాయి. అందరూ అలాగే పోవాలని లేదు. వ్రాసి పెట్టి ఉంటే ఎక్కడైనా జరుగుతుంది. కాలు జారిపడి చచ్చిపోయినవాళ్ళులేరా. Toilet మీద కూర్చొని చచ్చిపోయినవాళ్ళు లేరా? మన గీతలో బ్రతకాలి అని వ్రాసి పెట్టి ఉండాలి. ఆయుస్సు ఉండాలి. పుట్టటం, చావటం మన చేతులలో లేదు. అమ్మా, నాన్న తలచుకుంటే పిల్లలు వచ్చేస్తున్నారా బయటకు? చాలామంది పిల్లలకోసం చాలా ప్రయత్నాలు చేసినవారున్నారు. అయినా కావాలనుకున్నప్పుడు పిల్లలు రారు. వద్దను కున్నప్పుడు మానరు. ఇదంతా సృష్టిలో ప్రతిదీ. మన అమ్మా, నాన్నలను, తాత, ముత్తాతలను ఎవరు సృష్టించాడో, వాడి ప్రణాళిక ప్రకారం జరుగుతున్నది. ఈ రోజు మనం ఇక్కడ తినాలని వ్రాసిపెట్టి ఉన్నది గనుకనే ఇక్కడ తినగలుగుతున్నాము. లేకపోతే ఏదో అడ్డంవస్తుంది. కమ్మటి పాయసం నోట్లో పెట్టుకో బోతుంటే ఎవడో అంటాడు దానిలో బల్లి పడిందని. అంతే. దానిని తిన గలరా? లేదా తాజమహల్ హోటల్ వంటి రూమ్‌లో ఉంటే, ఎవడో చల్లగా ఎనౌన్స్ చేస్తాడు, అందులో బాంబు ఉన్నది అని. అందులో వాళ్ళు పైనుంచి దూకటానికైనా సాహసిస్తారుగాని, అంత ఎత్తునుంచి పడితే చచ్చిపోతాము అనుకోరు. ముందు ఈ బాంబు బాధనుంచి బయటపడితే చాలు

అనుకుంటారు. అందుకే ఆయుస్సు ఉండాలి. నేను బాగుండాలి. ముందర అది. తరువాతే ఇవన్నీ అనుభవించటం. ఇవన్నీ తక్కువై ఇందిరాగాంధీ పోయిందా? ఇవన్నీ తక్కువై రాజీవ్‌గాంధీ పోయాడా? వాళ్ళకేంతక్కువైంది? Security కి తక్కువా? Status కి తక్కువా? పదవులకు తక్కువా? దేనికీ తక్కువలేదు. మరి ఎందుకలా అయింది అంటే, అక్కడ ఆయుస్సులేదు. ఆయుస్సులేనప్పుడు ఏదోకారణం తన్నుకొస్తుంది, అంతే, చచ్చిపోతున్నారు.

ఆయుస్సు మన అమ్మా నాన్నలు ఇవ్వలా. వాళ్ళు కేవలం ఒక మాంస పిండాన్ని ఇచ్చారు. ఈ మాంసమయ పిండంలో భగవంతుడు పెట్టిన ప్రాణం ఎవరికైనా కనిపించిందా? Heart కొట్టుకుంటుంటే ప్రాణం ఉంది అంటాడు. శ్వాస ఆడుతుంటే ప్రాణం ఉంది అంటాడు. ఇవేవీ తెలియకుండా పోతే Brain dead అంటాడు. అంటే ఆయనను గుద్దినా, కోసినా, క్రిందమీద ఎట్లా పడేసినా, ఆయన ఊ అనడు. ఆ అనడు. ఎందుకని? దీనిని understand చేసుకొనే కనెక్షన్ (connection) లేదు. ఇదంతా ఆ ముద్దలోనే ఉన్నది. పోనీ ఇదంతా తెలిసిన డాక్టర్లు ఏమైనా చేయగలుగుతున్నారా? చేయి పట్టుకోగానే వ్యాధి తగ్గి బయటకు వచ్చాడంటే నాగొప్ప అంటాడు. వ్యాధి తగ్గక serious అయితే, ఆపైవాడికి మొక్కుకోండమ్మా! నేను చేయవలసిందంతా నేను చేస్తున్నాను అంటాడు.

ఒకవేళ ఆ పోయినవాడు Bank balance ఉంచుకొని పోతే, దాని కోసం అందరూ తన్నుకుంటారు. ఒక వార్ బయలుదేరుతుందక్కడ. ఎన్ని ఆనుమానాలు? మొన్న ఈ మధ్య ఈ రాతకోతల వ్యవహారం పరిష్కారం అయ్యేవరకు శవాన్ని కదిలించటానికి వీలు లేదు అని, కొన్ని పూటలో, రోజులో దహనం చెయ్యనీయకుండా ఆపేశారట. చూడండి కష్టపడి సంపాదించి చాలా దోషం చేశాడు. శుభ్రంగా, హాయిగా తిని, మిగిలింది ఏ దానధర్మాలకో వినియోగించినట్లైతే ఎవ్వరూ కొట్టుకోరు కదా! ఇవన్నీ నిత్య సత్యాలు. కాని మనం గుర్తించం. అన్నిటిని వదలి పెట్టనక్కరలేదు. కాని అన్నింటిలో ఉన్న సత్యాన్ని గుర్తించాలి. ఇవన్నీ కాచివడపోసి మహాత్ములు 'ఒరే పిచ్చివాడా! ఆయుస్సు పోసింది భగవంతుడు నాయనా! అందుకనే ఆ భగవంతుణ్ణి మనం శరణు పొంది ఉండాలి. దివ్యమైన భగవంతుడి అనుగ్రహాన్ని పొందాలి' అని మనకు చెప్తున్నారు.

మనలో ప్రాణం ఎలా కనిపించటంలేదో, అలాగే సర్వవ్యాపకంగా ఉన్న భగవంతుడు కూడ కనిపించటంలేదు. కాని ఆ భగవంతుణ్ణి చూడాలి అంటే ఎలాగ అనేది మహాత్ములు, పెద్దలు మనకు చక్కగా అందించారు.

సమర్థుడైన గురువు పాదం మనం వెదికితేరాదు. చదువుకుంటే రాదు. శాస్త్రాలు వల్లిస్తే రాదు. కాని ఏనాడు చేసుకున్న పుణ్య సంస్కారమో ఒక మహాత్ముని దరికి చేరాము. ఆయన పాదం మనకు లభించింది. ఆయన పాదం లభించిన తరువాత  మనకు దొరకనిదంటూ లేదు. నీవు చిన్నదే అడుగుతావో, లేక మహా పెద్దదే అడుగుతావో, లేక నిన్ను నీవు గుర్తిస్తావో, నీచేతిలోనే ఉన్నది. ఎందుకంటే, జీవితం వచ్చినందుకు సాధించవలసింది తనను తాను గుర్తించటమే.

పిల్లలు చదువుకోవలసిందే, పైకి రావలసిందే. కానీ ఈ రోజుల్లో చదువుకుంటే ఒక్క పిల్లగాని, పిల్లవాడు గాని తల్లిదండ్రుల దగ్గర ఉండరు. రెక్కలొస్తె. బయటకు వెళ్ళిపోతారు. వీడికి రోగాలు, రొష్టులు వస్తే, నేను డాలర్లు పంపిస్తాను, ఇదిగో నేను డాక్టర్‌కు ఫోనుచేస్తున్నాను, మీరు వెళ్ళి చూపించుకోండి, ఏమౌతుందో చూద్దాము అంటాడు. ఖర్మకాలిపోను అన్నారు అందుకే. మనం మన పెద్దవాళ్ళకు ఏం చేస్తున్నామో, అదే మనకు చేయటానికి మన పిల్లలు రెడీ. మీరు దానికి ప్రిపేరు అయిపొండి. ఎవరిని ఎవరు చూస్తారు? పైవాడు చూడవలసిందే. పైవాడు ఎవళ్ళలో చేరతాడో, అప్పుడు ఎవరు చేస్తారో మనకు తెలియదు. చూశారా! ఇంత జీవితం పెట్టుకొని మనని ఎవరు చూస్తున్నారంటే భగవంతుడు  చూడాల్సిందే.

మొన్న అమెరికా నుంచి ఒక భక్తుడు వచ్చాడు. విజయవాడలో వాళ్ళ తండ్రి గారికి చాలా సీరియస్ గా ఉన్నది. వెంటనే అభిషేకాలు మొదలు పెట్టించాము. నువ్వు చేసుకో గలిగినప్పుడల్లా వచ్చి అభిషేకం చేసుకో. లేకపోయినా ఇక్కడ గోత్రంతో జరుగుతుంటాయి అని చెప్పాను. అలాగే చేసుకున్నాడు. అతడి  పితృ భక్తిని, ఆవేదనను చూసి నాకే జాలి వేసింది. శ్రీ గురుదేవుని చూపించి, నాయనా పవిత్రాంతఃకరణంతో ఆపెద్దాయనకు నమస్కారం చేసుకో. ఇంకే కోరికలు కోరవద్దు అని చెప్పాను. వెళ్ళేరోజున మళ్ళీవచ్చాడు. అభిషేకం చేసుకొని పది గంటలకల్లా డాక్టరు వచ్చేసరికి explain చేయటానికి వెళ్ళాలి అన్నాడు. బాబూ నిన్నిక్కడ కట్టిపడేసేవారెవ్వరూ లేరు. నీకు ఎప్పటిదాకా ఉండటానికి వీలైతే అప్పటిదాకానే ఉండు. ఈరోజు గురుదశమి. హనుమజ్జయంతికూడా. గురుపూజ ఉంటుంది. నీకు breakfast, ఒక వేళ నీవు ఉంటే నీకు భోజనం అన్నదానంలో ఏర్పాటు చేశారు అన్నాను. ఆ అబ్బాయి పూజ అయి నేను వెళ్ళే వరకు వెళ్ళలేదు. అమ్మా మీరు అక్కడ ఉండగా సత్సంగాలకు నన్ను అక్కడికి రప్పించేస్తారా? అని అడిగాడు. బాబూ నాదేమి బాధ్యతలేదు. అదిగో ఆయన ఉన్నాడు గదా!

ఆయనకు దండంపెట్టుకో. ఆయనకు అన్నీ తెలుసు. ఏం చేయాలో అన్నీ ఆయనే చూసుకొంటాడు. నీవు దండం పెట్టుకొనేటప్పుడు నీ తండ్రి రూపంలో ఉన్న జగన్నాధుడికి, జగమెరిగి సేవచేస్తున్నాను అనుకో. నిన్ను ఆయనే చూస్తాడు, అన్నాను. పోనీ వచ్చేస్తానమ్మా! సత్సంగాలకు అన్నాడు. సత్సంగాలకంటే నీధర్మం ఏమిటంటే ఇక్కడ నీ తండ్రిగారి సేవ. కోమాలో ఉన్నా, వారు తిరిగి చెప్పలేక పోవచ్చుగాని, మనం చెప్పేవి, చేసేవి వాళ్ళకు అర్థం అవుతాయి. మీరు సేవ చేస్తున్నట్లు మీ తండ్రి గారికి తెలిస్తే, ఆ జీవుడికి తృప్తి కలుగుతుంది. ఆ తృప్తి వలన కూడా ఆయన కొంచెం తొందరగా బయట పడవచ్చు. Recover కావచ్చు. అందుకని నీవు సేవ చేయటం ముఖ్యం. ఇక్కడ నీధర్మం అదే. నీకు ఖాళీ ఉన్నప్పుడల్లా వెళ్ళి స్వామివారి దర్శనం చేసుకుంటూ ఉండు. మళ్ళీ నేను వస్తాను కదా! చూద్దాం. కానీ ఈ లోపల పంపిస్తారేమో పెద్దాయన, చెప్పలేము అన్నాను. అటువంటి అవకాశం ఎవరు ఇస్తారు. భగవంతుడు తప్ప అటువంటి అభయహస్తం ఎవరిస్తారు? తత్తిమావాళ్ళంతా ఇంకా ఉన్నాడా? ఎప్పుడు వెళ్ళి పోతాడు? పైకి వెళ్ళిపోతాడు అంటే వస్తా. ఫరవాలేదంటే రాను. ఇలా ఉన్నై ఇక్కడ నుంచి ఫోన్లు.

రేపు మనకేమవుతుంది? ఈ ప్రాణాన్ని పోసేదీ మనంకాదు. తీసేదీ మనంకాదు. తాళాలు వాడి దగ్గర ఉన్నై. కాని మనస్సురీతిలో తాళాలు మన చేతిలో ఉన్నై. ముందు ఇంట్లో పరిస్థితులను చక్కబెట్టుకోవాలి. మమకారంలో కూరుకోకుండా, అహంకారాన్ని భగవంతుడికి వదలి పెట్టి మనం చేయాల్సిన ధర్మాన్ని చేస్తూ, రెండు చేతులతో భగవంతుడి రెండు పాదాలను ఆశ్రయించాలి. అంటే చిత్తం ఎప్పుడూ భగవంతుణ్ణి ఆశ్రయించాలి. స్వధర్మాన్ని ఆచరించవలసి వచ్చినప్పుడు కుడి చేత్తో పనులన్నీ చేసుకొని, పనులైపోయిన తర్వాత దానిని కూడా గురుపాదాల వద్ద చేర్చాలి. ఆ పదములను ఆశ్రయించి గురుదేవుల బోధ ద్వారా మనకు ఏదైతే అందించారో దానిని అర్థం చేసుకుంటూ ముందుకు వెళ్తే ఎలాఉంటుంది మన జీవితం? పవిత్రమైన అంతఃకరణ, పవిత్రమైన ప్రేమ, దేన్నైనా సరే, ఏవిషయమైనా సరే,ఎవరిని చూసినా సరే,ధర్మపరమైన దృష్టి,దానికే మహాత్ములు చెప్పారు, సృష్టిని మార్చలేముగాని, దృష్టిని మార్చుకో అని. జీవితంలో రకరకాలైన కష్టాలు, ఇబ్బందులు, రోగాలు, రొప్పులూ వస్తూంటై. ప్రతిదానికి భగవంతుని మీద భారంవేసి, సమయస్ఫూర్తితో చక్కని నిర్ణయం తీసికొని,ధర్మంగా నడచుకోవాలి. ధర్మంగా ఇంకొకళ్ళకు చూపించాలి. అప్పుడు ఎన్ని కష్టాలలో ఉన్నా, రాగద్వేషాలలో ఉన్నా, భగవంతుడు తప్పక గుర్తుంటాడు. -సశేషం




(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

సత్యం తెలిసి కూడా దానిని స్వీకరించే సాహసం లేనివారా గణతంత్రం అంటే? పవనరేఖను పూర్ణతః స్వీకరించి ఈ దుఃఖపూరితమైన అధ్యాయాన్ని స్మృతి గర్భంలో లీనం చేసి ఉంటే కృష్ణా! ఈ గణతంత్రం అమరమై ఉండేది... దానిని ఈ కంసుడు, కృష్ణుడు ఇంకా ఎంతో శక్తివంతం, తేజోవంతం చేసి ఉండేవాళ్ళు....."

"వ్యకి ఎంత గొప్పవాడైనా, మామా!" కృష్ణుడు సంయమనంతో చెప్పటానికి ప్రయత్నిస్తూ " ఒక వ్యక్తికి జరిగిన అన్యాయం ఎంత నిష్ఠురమైనదైనాసరే, ఎంతటి సమర్థవంతుడైన వ్యక్తికైనా ఏకాధికారం స్థాపించే హక్కు లేదు! అన్యాయాన్ని ఎదుర్కొనటం ఒకటి, అన్యాయాన్ని నిమిత్తంగా చేసి సమాజాన్ని తన చేతిలో పెట్టుకోవటం ఇంకొకటి. ఈ రెండవది అసలు అన్యాయం కంటే ఎన్నో రెట్లు ఘోరమైనది మామా! ఒక అన్యాయాన్ని ఇంకొక పెద్ద అన్యాయం ద్వారా సరిచేయటానికి వీలుకాదు..... మామా! ఈ మూల సత్యాన్ని మీరు ఎట్లా మరిచారు?"

కంసుని కళ్ళు మూతలు పడుతున్నాయి. దేహం ఎగిరి ఎగిరి పడుతోంది. మృత్యువు అతనిని కబళించటం ప్రారంభించింది.

"సత్యం ఒక కల్పన కృష్ణా!" కంసుని స్వరం ఎక్కడో నూతిలోంచి వస్తున్నట్లుగా ఉంది.... శ్వాస ఆగి ఆగి కొట్టుకుంటున్నది... ఒక్కొక్క శబ్దం ఎంతో కష్టంగా అనగలుగుతున్నాడు.... " ఈ కల్పనను కొంతమంది సమర్థులు తమకు అనుకూలంగ ఉండేటట్లు మలచుకొన్నారు. ఒకనాడు ఆర్య ఉగ్రసేనుడు సత్యం... నిన్నటిదాక కంసమహారాజా పరమసత్యం... రాబోయే కాలంలో బహుశః గోకులంలోని గోపాలకృష్ణుడు...."

"లేదు అదేమీ కాదు మామా!.... ఉగ్రసేనుడు, కంస కృష్ణుల కంటె పరమతత్త్వం...." కృష్ణుడు శిలాప్రతిమలలాగ నిలబడిన జనాన్ని నిర్దేశిస్తూ "నిశ్చలంగా కనిపించే ఈ సముదాయంలోని ప్రాణమే పరమతత్త్వం. ఈ

ప్రాణాన్ని సంరక్షించటం, ఎవరు అత్యంత కుశలతా పూర్వకంగా చేయగలడో అతడే ఉత్తమ శాసకుడు. ఏ ఒక కంసుడో, కృష్ణుడో ఇది చేయలేడు! గణతంత్రం గొప్పది మామా! అన్నిటికన్నా గొప్పది. మీరు ఈ గణతంత్రాన్నే మార్చి వేశారు." "నిష్పాపి అయిన పవనరేఖ ఆత్మను హత్యచేసిన గణతంత్రం ఎన్నటికీ నిలబడదు. కృష్ణా! కంసుడు ఏది చేశాడో అదే భవిష్యంలో కృష్ణునిచేతుల ద్వారా జరగవచ్చు... పవనరేఖ నిర్దోషిత్వాన్ని దండించి కనక ఉంటే..." కంసుడు ఇక మాట్లాడలేకపోయాడు. మాట ఆగిపోతోంది.

కృష్ణుడు నెమ్మదిగా కంసుని చరణాలపైకి వంగాడు. భూమాసురుని కారాగారవాసంనుండి విడిపించబడి ద్వారకకు చేరుకొన్న స్త్రీల చిత్రం అతని మనస్సులో నిలిచింది... ఇంక ఎవరూ పవనరేఖ అవదు....

"అక్రూరా!" ఉద్ధవుడు అతీతంలోకి పోయిన అక్రూరుని నెమ్మదిగా జాగృతం చేశాడు. వకుళ పుష్పాలపై నుండి వచ్చే సుగంధం ఇక వ్యర్థం తండ్రీ! రాత్రి మూడవజాము పూర్తి అయినట్లు ఢంకా వాయించారు మీరు వినలేదా?"

"కృష్ణుని ఆ శంఖనాదాన్ని విన్నావా వత్సా?" అక్రూరుడు స్వగతంగా మాట్లాడుతున్నట్లుగా అంటున్నాడు. "నీకు గుర్తు ఉందా ఉద్ధవా! ప్రాగ్జోతిషపురంలో భౌమాసురుని సంహరించి కృష్ణుడు అతని అంతఃపురంలో ఖైదు చేయబడిన స్త్రీలను ముక్తులుగా చేశాడు..."

"అవును! కృష్ణుడు ఆ స్త్రీలను ముక్తులను చేయటమే కాదు.... వారందరినీ ఆర్యావర్తంలో సర్వ శ్రేష్ఠ కులీన స్త్రీలనుగా ప్రతిష్ఠించాడు.... ద్వారకలోని రాజమహల్‌లో వారందరినీ సమ్మానపూర్వకంగా స్థాపన చేసి కృష్ణుడు వారికి రుక్మిణి సత్యభామలతో సమానమైన స్థానాన్ని కల్పించాడు.

"అలా పునస్థాపన చేసి ఉండకపోతే వందలాది నిర్దోషులు, నిష్పాపులు అయిన ఆ స్త్రీలకు భౌమాసురుని చేత జరిగిన అన్యాయం అనే దావానలం నుంచి అసంఖ్యాకులైన కంసులు ప్రకటమై ఉండేవారు ఉద్ధవా! ఆ స్త్రీలను ఆర్యావర్తం ఎన్నటికీ స్వీకరించి ఉండకపోతే - ఒక్క పవనరేఖకు జరిగిన అన్యాయం వ్రజభూమిలో గణతంత్రాన్ని ఎన్నో సంవత్సరాలవరకు భస్మం చేసింది. మరి వందలాది స్త్రీలపట్ల ఆర్యావర్తం అలా అన్యాయం చేసి ఉంటే..." అక్రూరుడు మాట్లాడుతూ ఆగాడు.

"కాని ఆ సమయంలో దాని మహానతా దాని మూల్యం తెలుసుకొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు...." అక్రూరుడు

వేదనాభరితమైన స్వరంతో ఇంకా ఇలా అన్నాడు "కృష్ణుడు ఈ యుగంలో ఉన్నా మనమూ ఆయనను అర్థం చేసుకోలేదు.... నేను స్వయంగా చేసిన పాపాచరణం, ఈ రోజు గుర్తు చేసుకుంటే....

"తండ్రీ..!" ఉద్ధవుడు ఇంకా ఏమీ మాట్లాడలేకపోయాడు.

గలగల ప్రవహించే కాళింది జలప్రవాహంలో ఏదో జలచరం బహుశ గంతులు వేస్తోంది!... ఆ ధ్వనిలో ఉద్ధవుడి స్వరం కలసిపోయింది.

అక్రూరుడు ఒకసారి గతంలోకి పోయాడు..... అక్రూరునికి జరిగినదంతా అసహనీయంగా ఉంది. మణి దొరకటం, కృష్ణుడు దానిని సత్రాజిత్తుకు తిరిగి ఇవ్వటం - అపకృత్యుడైన సత్రాజిత్తు తన పుత్రిక సత్యభామ వివాహం శ్రీకృష్ణునితో చేయటం.... ఊహించలేని వన్నీ ఒకసారి ఎలా జరిగాయి?.... ఇవన్నీ తనకు కిట్టనివి.

కొన్ని రోజుల తర్వాత శతధన్వుని ఏకాంతంగా కలిశాడు. "శతధన్వా! సత్యభామను నీకు ఇచ్చి వివాహము చేయాలని సత్రాజిత్తు సంకల్పం కదా?" అన్నాడు అక్రూరుడు సావధానంగా.

"అలాగా! ఆ విషయం నాకు తెలియదే! సత్యభామను వివాహం చేసుకోవాలని నేను ఒకప్పుడు అన్నమాట మాత్రం నిజం, అని అక్రూరుడుతో" అన్నాడు శతధన్వుడు.

"దానికి సత్రాజిత్తు ఏమన్నాడు?"

"విశేషంగా ఏమీ స్పందించలేదు. సరే ఇంకెప్పుడైనా ఈ ప్రస్తావన తేవాలని అనుకొన్నాను."

అక్రూరుడు ఆలోచనలో పడ్డాడు. సత్రాజిత్తు తన పుత్రికను శతధన్వునికి ఇవ్వాలని ఉంది అని తనతో అన్నాడే. మరి ఈ విషయం శతధన్వునికి తెలియదే. సత్రాజిత్తు తనని దూరంగా ఉంచటానికే అలా అన్నాడా. అక్రూరుని కోపం ఇంకా ఇనుమడించింది.

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - Guda Siva Rama Murthy,

ఇప్పుడు నేనని చెప్పుకున్నామే దానిని మీరు ధ్యానం ద్వారా తెలిసికో వచ్చు. ధ్యానంలో భ్రూమధ్యంలో సంచరించే కాంతియే నేను. అదే గురు పరమాత్మ. అండర్‌స్టాండ్? అన్నారు శ్రీబాబు. సమాధి ద్వారా కలిగే ఆనందం కన్న గురుచరిత్ర కీర్తించటం చాల గొప్పది. దీనిని అనుభవ పూర్వకంగా తెలిసికోవాలంటే మీకు ఒక దృష్టాంతం చెబుతాను. మీరు మీ శ్రీమతికి దూరంగా విదేశాలలో ఉన్నారనుకోండి. పాపం! మీ శ్రీమతి మిమ్మల్ని చూడాలనుకుని మీకు ఉత్తరం వ్రాయగానే వెంటనే బయలుదేరి మీ శ్రీమతిని ఎలా కలుసుకుంటారో, అదే విధంగా భగవంతుని ఎడబాటును గురించి తపన చెందాలి. అంతటి తపన చెందాలేగాని, భగవానుడు ఊరుకుంటాడా?

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ సంసారమనే ఎండమావుల సాగరాన్ని దాటటానికి సాధన అనే నావ ఎక్కి ఆ సాగరంలో పూర్తిగా మునిగితే ఆ సాగరం లేదు. సాధన లేదు. తానే మిగులుతాడు. ఇక్కడే మీరు కడు జాగ్రత్త వహించాలి. సాధన లేదు అన్నదాన్ని అపార్థం చేసుకోకూడదు. సంసారం సాగరం, నావ, సాధన అన్నీ అదృశ్యమయ్యేవే. ఉన్నది తానే అన్న విషయాన్ని గ్రహించాలి. నేను ఎవరు? అన్న ప్రశ్నకు ఆన్సర్ దొరికేవరకు సాధన ఉంటుంది. క్వశ్చన్ నో, ఆన్సర్ నో. అందువలననే గురుదేవులు శిష్యుడికి మంత్రోపదేశం చేయడానికి అతనిలో ఎంతో ఆవేదన కలిగితేకాని చేయరు.

**27-3-1985**

ఈ రోజు రాత్రి జరిగిన సత్సంగ సమావేశంలో శ్రీబాబు మాట్లాడుతూ మన మూర్తీజీ రిటైరు అవుతాను, రిటైర్ అవుతాను అనటమే గాని, అవ్వరు. పాపం డిప్యూటీ జి.ఎమ్. చేయాలని ఉంది అన్నారు. మూర్తీజీ మాట్లాడుతూ లేదు బాబూ మీరు వద్దంటే చేయను అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ ఆకలి తీవ్రంగా ఉంటే తినవద్దంటే మానుకుంటావుటయ్యా? అన్నారు. శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ ఒక వ్యక్తి తనకు ఉన్నదాంతోనే తృప్తిని పొంది ఎక్కువ ఆశకు పోడు. వేరొకడు ఎంతో తాపత్రయపడి జీవితం అంతా వృథా చేసుకుంటాడు. ఇద్దరిలో ఎవరు గొప్ప? అని ప్రశ్నించారు. పరుగులెత్తి పాలు త్రాగటం కన్న నిలబడి నీళ్ళు త్రాగటం మంచిది కదా! అన్నారు. మానవ జీవితం అంటే చదవటం, పాండిత్యాన్ని సంపాదించటం, ధనార్జన చేయుటం పదవులని చేపట్టటమేనా! అవి గమ్యస్థానానికి చేరుస్తాయా? అన్నారు.